మారని బతుకులు..!

అభివృద్ధి జాడలేని గిరిజన తండాలు

- పంచాయతీలుగా మార్పుతో సరి
- తాగునీరు, రోడ్లు, ఇళ్ల సమస్యలు సశేషం
- నిధులు లేక విలవిల
- సిగ్నల్ కోసం గుట్టలు ఎక్కాల్సిందే
- అధికవర్షం వస్తే రాకపోకలు బంద్





చవిటి తండాలో అధ్వానంగా ఉన్న రోడ్డు

ప్రత్యేక పంచాయతీలపై ప్రభుత్వం శీతకన్ను

ప్రత్యేక గిరిజన పంచాయతీలు ఏర్పాటు చేసిందే తప్ప.. మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైంది. మా గ్రామంలో రోడ్డు, మురుగునీటి కాలువలు లేవు. వీధిదీపాలు పనిచేయడంలేదు. రాత్రిళ్లు బయటకు రావాలంటే కష్టంగా ఉంది. అత్యవసర సమయంలో 108కు ఫోన్ చేయాలన్నా గుట్టలెక్కాల్సిందే.

- నారాయణ నాయక్, చవిటి తండా, కదిరి మండలం



ఇది పూరిగుడిసో, పశువుల పాకో అనుకుంటే తప్పులో కాలేసినట్లు. కానే కాదు. ఇది అంగన్‌వాడీ కేంద్రం. నమ్మడానికి విడ్డూరంగా ఉన్నా.. ఇది ముమ్మాటికీ వాస్తవం. కదిరి మండలంలోని చిగురుమాను తండాలో ఈ పాకలోనే అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు. తండాలు అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయనడానికి ఈ పాకే నిదర్శనం..

కదిరి, మే 1: గిరిజనుల జనాభా 500 కంటే ఎక్కువ ఉన్న తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. అభివృద్ధి మరిచారు. గిరిజన తండాల్లో సమస్యలు తిష్ట వేశాయి. కనీస సౌకర్యాలు లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. కొండగుట్టల్లో దుర్భర జీవనం సాగిస్తున్న వారి గురించి పట్టించుకునే వారు కరువయ్యారు. కరెంటు బిల్లుల పేరుతో వచ్చిన నిధులు ప్రభుత్వమే తీసుకుంది. నిధులు లేక సమస్యలు పరిష్కరించలేక సర్పంచ్‌లు ఇబ్బందులు పడుతున్నారు. కనీస సౌకర్యాలైన తాగునీరు, రోడ్లు, మురుగునీటి కాలువలు, కరెంటు సరఫరా కూడా లేదు. పెద్ద వర్షం కురిస్తే కొన్ని తండాలకు రాకపోకలు బంద్ అయ్యే పరిస్థితి ఉంది. సచివాలయానికి వెళ్లాలంటే కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సిందే. పంచాయతీ కేంద్రానికి వెళ్లాలన్నా కిలోమీటర్ల వెళ్లాల్సిందే. గిరిజన తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేయడం ద్వారా ఒరిగిందేమీ లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. గాండ్లపెంట మండలం గాజులవారిపల్లి పెద్దతండా, తుమ్మలబైలు పెద్దతండా, నల్లచెరువులో బాలేపల్లి తండా, కదిరి మండలంలో చౌటితండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేశారు.

నిధుల్లేక విలవిల

500 మంది జనాభా ఉన్న గిరిజన తండాలను పంచాయతీలుగా మారితే అభివృద్ధి చెందుతాయని అందరూ ఆశించారు. అందుకు భిన్నంగా గిరిజన పంచాయతీలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. ఈ పంచాయతీలకు అరకొరగా వచ్చిన నిధులను కూడా ప్రభుత్వం లాగేసుకుంది. దీంతో గిరిజన పంచాయతీలు అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచాయి.



చవిటి తండాలో నిలువ ఉన్న మురుగు నీరు

అభివృద్ధి జాడలేని తండాలు

ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గిరిజన పంచాయతీల్లో అభివృద్ధి జాడ కనిపించట్లేదు. గాండ్లపెంట మండలంలోని తుమ్మలబైలు పెద్దతండాలో సచివాలయానికి వెళ్లాలంటే ఏడు కిలోమీటర్లు దూరమున్న గొడ్డివెలగలకు వెళ్లాల్సి వస్తోంది. తుమ్మలబైలు పెద్దతండా, గరుగుతండాలను కలిపి పంచాయతీగా ఏర్పాటు చేశారు. పంచాయతీ కేంద్రమైన తుమ్మలబైలు పెద్దతండాకు గరుగుతండా గిరిజనులు వెళ్లాలంటే తుమ్మలబైలుకు వచ్చి, అక్కడి నుంచి పెద్దతండాకు వెళ్లాల్సి వస్తోంది. వీటి మధ్య దాదాపు ఆరు కిలోమీటర్లు ఉంది. పెద్దతండా, గరుగుతండా మధ్య దూరం ఒకటిన్నర కిలోమీటరు మాత్రమే. ఈ రెండుతండాల మధ్య రోడ్డు సౌకర్యం లేక గిరిజనులు ఆరు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోంది. మారుమూల ప్రాంతంలో ఉండడం మూలంగా సెల్‌ఫోన్ సిగ్నల్ కోసం గుట్టలు ఎక్కాల్సి వస్తోంది. నెట్‌వర్క్ రావాలంటే ప్రభుత్వ పథకాల కోసం గుట్టలెక్కి సిగ్నల్ కోసం ఎదురుచూసే పరిస్థితి నెలకొంది. ఇదే మండలంలోని గాజులవారిపల్లి పెద్దతండాలోని కల్లుబాయి తండాకు వర్షం కురిస్తే రాకపోకలు నిలిచిపోతాయి. మధ్యలో ఉన్న వాగు పొంగితే మండలకేంద్రంతో తండాకు సంబంధాలు తెలిపోతాయి. కొత్తపంచాయతీ ఏర్పడినా గిరిజనులు అభివృద్ధికి దూరంగానే ఉన్నారు.

తాగునీటి సమస్య తీవ్రం

తాగునీటి సమస్యతో ఐదేళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం. సర్పంచ్ పట్టించుకోలేదు. అడిగితే 'మీరు మాకు ఓటు వేయలేదు కాబట్టే మీకు తాగునీరు సరఫరా చేయమ'ని కరాఖండిగా చెబుతున్నారు. తండాను పంచాయతీ చేసినా ఒరిగిందేమీ లేదు. గుక్కెడు నీటికోసం పడరాని పాట్లు పడుతున్నాం. కరెంటు ఉన్న సమయాల్లో వ్యవసాయ బోర్లను ఆశ్రయించాల్సి వస్తోంది.



- లలితాబాయి, బాలేపల్లి ఎగువతండా, నల్లచెరువు మండలం






బాలేపల్లి ఎగువతండాలో తాగునీటి బోరు వద్ద నీటికోసం ఇబ్బందులు

కనీస సౌకర్యాలు కరువు

ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటైన తండాలు కనీస సౌకర్యాలకు నోచుకోలేదు. తాగునీరు, రోడ్లు, కరెంటు వంటి సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. నల్లచెరువు మండలంలోని బాలేపల్లి ఎగువ, దిగువ తండాల్లో 1200 జనాభా ఉన్నారు. ఇక్కడ తాగునీరు లేక గిరిజనులు వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్నారు. తాగునీటి సమస్యను సర్పంచ్ దృష్టికి తీసుకెళ్తే తనకు ఓట్లు వేసినవారికే సరఫరా చేస్తామని చెబుతున్నట్లు తండావాసులు వాపోతున్నారు. తాగునీటికోసం యుద్ధం చేయాల్సి వస్తోందని బాగేపల్లి తండావాసులు వాపోతున్నారు. ఇంటింటికీ మోటార్లు బిగించడం ద్వారా తాగునీటి సరఫరా సరిగా సాగడం లేదంటున్నారు. గాండ్లపెంట మండలంలోని తుమ్మలబైలు పెద్దతండాలో తాగునీటి సమస్య వేధిస్తోంది. సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్‌తో తాగునీటి బోరు నడుస్తుండడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వాపోతున్నారు. నల్లగుట్టతండాలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందంటున్నారు. కదిరి మండలంలోని చిగురుమాను, చెవిటి తండాల్లో ఇంటింటికీ కొళాయిలు లేవు. తాగునీటికోసం ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ఈ తండాల్లో రోడ్డులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో బయటకు రావాలంటే ఇబ్బందిగా ఉందని ఆందోళన చెందుతున్నారు. డ్రైనేజీలు లేక రోడ్డుపైనే నీరు వదలడంతో మురుగునీటి గుంతలు ఏర్పడి, దోమలు పెరిగి అనారోగ్యం పాలవుతున్నట్లు బాధపడుతున్నారు. ఇక్కడ అంగన్‌వాడీ కేంద్రాన్ని పూరిగుడిసె, అద్దె ఇంటిలో కొనసాగిస్తున్నారు. గాండ్లపెంట మండలంలోని తుమ్మలబైలు పెద్దతండాలో అంగన్‌వాడీ భవనం లేక ఇబ్బందులు పడుతున్నారు. గాజువారిపల్లి పెద్దతండా పంచాయతీనల్లగుట్టతండాలో అంగన్‌వాడీ భవనం అసంపూర్తిగా ఉంది. కనీస సౌకర్యాలు కరువయ్యాయి. సర్పంచ్‌లను ప్రశ్నిస్తే, రాష్ట్ర ప్రభుత్వం నిధులు లాగేసుకుందనీ, తాము ఏమీ చేయలేమని చేతులెత్తేసినట్లు చెబుతున్నారు.



ఇది కొండ కాదు, గుట్ట అంతకన్నా కాదు. రెండు తండాలను కలిపే నడకదారి. గాండ్లపెంట మండలంలోని తుమ్మలబైలు పెద్దతండా, గరుగుతండా మధ్య రాకపోకలు సాగించేందుకు ఈ దారే దిక్కు. పెద్ద పెద్ద బండరాళ్ల మధ్య నుంచి సాహసం చేసుకుంటూ వెళ్లాల్సిందే. ఏమాత్రం పట్టుతప్పినా కిందపడిపోతారు.

విద్యుత్ సమస్యతో తాగునీటి ఇబ్బందులు



తాగునీటి బోరుకు త్రీ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ లేక తరచూ సమస్య వస్తోంది. ప్రస్తుతం సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో తరచూ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతున్నాయి. దీంతో తాగునీటికి ఇబ్బంది పడుతున్నాం. పంచాయతీ ఏర్పడినప్పటినుంచి నిధులిచ్చింది లేదు, అభివృద్ధి చేసిందీలేదు. వైసీపీ ప్రభుత్వం గిరిజనులను పట్టించుకోవడం లేదు.

- శ్రీరాములునాయక్, తుమ్మలబైలు పెద్దతండా, గాండ్లపెంట మండలం

ప్రాంతం	పుట్టపర్తి	కదిరి	ధర్మవరం	హిందూపురం	పెనుకొండ
గరిష్ఠం కనిష్ఠం	41.0 29.0	41.0 29.0	42.0 29.0	39.0 27.0	40.0 27.0

8లోగా పరీక్ష రుసుం చెల్లించండి



కొత్తచెరువు, మే 1: డైట్ నాలుగో సెమ్ పరీక్ష రుసుం ఈనెల 8వ తేదీలోగా చెల్లించాలని జిల్లా పరీక్షల నిర్వహణాధికారి లాజర్ బుధవారం ప్రకటనలో తెలిపారు. డైట్ కళాశాల ప్రిన్సిపాల్‌కు చెల్లించాలని సూచించారు. జూన్‌లో పరీక్షలు ఉంటాయన్నారు. ఒక సబ్జెక్టుకు రూ.125, రెండింటికి రూ.150, మూడింటికి రూ.175, నాలుగింటికి రూ.250 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. 8వ తేదీ గడువు దాటితే విద్యార్థులు అపరాధ రుసుం రూ.50తో 15లోగా చెల్లించాలని ఆయన తెలిపారు. సాధారణ అభ్యర్థులకు పరీక్ష రుసుం రూ.250, ప్రిన్సిపాల్ వెబ్ అప్లికేషన్ ఫారాన్ని నింపే ప్రక్రియలో కనిపించే మొత్తం గేట్ వే ద్వారా రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు వేర్వేరుగా ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు డైట్ ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని సూచించారు.

పాపం.. పసికందు..!

రొద్దం, మే 1: కళ్లు కూడా తెరవకుండానే.. ఈ లోకాన్ని చూడకుండానే.. అప్పుడే పుట్టిన పసికందు శవమై, రోడ్డు పక్కకు చేరాడు. అభంశుభం తెలియని ఆ పసిగుడ్డు రోడ్డు పక్కన మండుటెండలో పడి ఉంది. మండలంలోని పెద్దగువ్వలపల్లిలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల సమీపాన బుధవారం ఉదయం పసికందును పడేసి వెళ్లారు. స్థానికులు గమనించి, అయ్యోపాపం పసికందు అంటూ ఆవేదన చెందారు. గ్రామస్థులు.. పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, పసికందు దేహాన్ని ఖననం చేశారు.

రెండోదశ ర్యాండమైజేషన్ పూర్తి

పుట్టపర్తి, మే 1: స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం అసెంబ్లీ నియోజకవర్గస్థాయి ఈవీఎంల రెండోదశ ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌బాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఈవీఎంల ర్యాండమైజేషన్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పారదర్శకంగా నిర్వహించామన్నారు. అనంతరం కలెక్టర్ వీడియోకాన్ఫరెన్సు ద్వారా రిటర్నింగ్ అధికారులతో ఎన్నికల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. పోలింగ్ స్టేషన్లలో పెండింగ్ పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. 85 ఏళ్లు నిండిన వారికి ఇంటి వద్దకే ఓటు అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు దీపక్ రామచంద్ర తివారి, అమిత్‌కుమార్, పోలీసు పరిశీలకుడు ఇమ్నాలెన్సా, డీఆర్‌ఓ కొండయ్య పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న కూటమి బీజేపీ అభ్యర్థి సత్యకుమార్ యాదవ్

కేంద్ర మాజీ మంత్రి సయ్యద్ షానవాజ్ హుస్సేన్.. బీజేపీలోనే ముస్లింలకు సరైన గౌరవం: సత్యకుమార్ యాదవ్

దేశంలో పుట్టిన ప్రతీ ముస్లిం భారతీయుడే

ధర్మవరం, మే 1: దేశంలో పుట్టిన ప్రతి ముస్లిం భారతీయుడేనని కేంద్ర మాజీ మంత్రి సయ్యద్ షానవాజ్ హుస్సేన్ పేర్కొన్నారు. టీడీపీ స్థానిక కార్యాలయంలో ముస్లింలతో బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కూటమి హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి, ఉమ్మడి బీజేపీ ధర్మవరం ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్ యాదవ్, టీడీపీ ధర్మవరం ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. సయ్యద్ షానవాజ్ హుస్సేన్ మాట్లాడుతూ.. బీజేపీ నుంచి ముస్లింలను వేరుచేయడానికి ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయన్నారు. బీజేపీ కుల పార్టీనో, వారసత్వ పార్టీనో కాదన్నారు. పార్టీ బలోపేతానికి కృషిచేసిన ప్రతి ఒక్కరికీ కులమతాలకు అతీతంగా ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన తాను బీజేపీలో కేంద్ర విమానయన శాఖ మంత్రిగా పని చేశానన్నారు. దేశంలో హిందూముస్లింలను ఎవరూ వేరుచేయలేరని స్పష్టంచేశారు. సత్యకుమార్‌తో తనకు 30 ఏళ్ల రాజకీయం సంబంధ ఉందనీ, ఆయనను గెలిపిస్తే ధర్మవరాన్ని రాష్ట్రంలోనే అగ్రగామిగా అభివృద్ధి చేస్తారన్నారు. ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథిని కూడా గెలిపించుకోవాలని ఆయన సూచించారు. అనంతరం సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ... నరేంద్ర మోదీ హయాంలో ఎక్కడా ముస్లింలను ఇబ్బందులు పెట్టిన దాఖలాలు లేవన్నారు. అబ్దుల్ కలాంను రాష్ట్రపతిని చేసింది బీజేపీయేనన్నారు. మోదీ, చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన 13 పథకాలను రద్దు చేయడమేనా ముస్లింలకు సీఎం జగన్ ఇచ్చే గౌరవం అని నిలదీశారు. ముస్లింలను జగన్ ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో కదిరి మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు గోనుగుంట్ల విజయ్‌కుమార్, కమతం కాటమయ్య, జూనియర్ ఎన్టీఆర్ కల్చరల్ అసోషియేషన్ రాష్ట్ర కన్వీనర్ ఎల్ నరేంద్రచౌదరి, మాజీ ఎంపీపీ వేణుగోపాల్ రెడ్డి, ముస్లిం మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగూర్‌హుస్సేన్, నియోజకవర్గ అధ్యక్షుడు అత్తార్ రహీంబాషా, రాళ్లపల్లి షరీఫ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి సయ్యద్ షానవాజ్ హుస్సేన్





మాట్లాడుతున్న నారా బ్రాహ్మణి, నందమూరి వసుంధరాదేవి

బాలకృష్ణ హ్యాట్రిక్ సాధిస్తే జిల్లా రూపురేఖలే మారుతాయ్ : నారా బ్రాహ్మణి

వందల కోట్లతో పురం అభివృద్ధి

హిందూపురం, మే 1: నందమూరి బాలకృష్ణ హిందూపురం నుంచి మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచి, హ్యాట్రిక్ సాధిస్తే వందల కోట్ల రూపాయల నిధులు తీసుకొచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తారని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేశ్ సతీమణి నారా బ్రాహ్మణి అన్నారు. ఉమ్మడి జిల్లా రూపురేఖలే మారుతాయన్నారు. స్థానిక జేవీఎస్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం స్త్రీశక్తి మహిళా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి నందమూరి వసుంధరాదేవి, వారి కుమార్తెలు నారా బ్రాహ్మణి, తేజశ్విని హాజరయ్యారు. నారా బ్రాహ్మణి మాట్లాడుతూ.. రెండుసార్లు లేపాక్షి ఉత్సవాలను ఘనంగా నిర్వహించి హిందూపురం ఖ్యాతిని దేశ నలుమూలలా చాటింది నారా చంద్రబాబునాయుడు, బాలకృష్ణలేనన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు ప్రజలకు మేలు చేకూరుస్తాయన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తారన్నారు. డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించారన్నారు. నందమూరి బాలకృష్ణ మహిళలకు ఎప్పుడూ అండగా ఉంటారన్నారు. హిందూపురాన్ని దశాబ్దాలకాలంగా వెంటాడుతున్న నీటి సమస్యను ఎమ్మెల్యే బాలకృష్ణ పరిష్కరించారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి, కూరగాయల మార్కెట్, రహదారి, హంద్రీనీవా ద్వారా చెరువులకు నీరందించారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసి, భోజనం పెట్టారన్నారు. బాలకృష్ణను గెలిపించాలని కోరారు. నందమూరి వసుంధరాదేవి మాట్లాడుతూ.. మూడోసారి నందమూరి బాలకృష్ణ బరిలో ఉన్నారనీ, ఆయనను గెలిపించాలన్నారు. సమావేశంలో పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన మహిళలు

బ్రాహ్మణిని కలిసిన జిల్లా అధ్యక్షుడు



హిందూపురం పర్యటనకు వచ్చిన నారా బ్రాహ్మణిని చిలమత్తూరు మండలంలోని కొడికొండ చెక్‌పోస్టు వద్దగల రక్షా అకాడమీలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, స్వాగతం పలికారు.

ఓటర్లకు వైసీపీ ప్రలోభాలు



ఓటర్లకు వంట నూనె ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న వైసీపీ నాయకులు

నల్లచెరువు, మే 1: మండల కేంద్రంలో ఓటర్లకు వైసీపీ నాయకులు ప్రలోభాలకు లోనుచేశారు. బుధవారం రాత్రి నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. వైసీపీ మండల కన్వీనర్ హైదర్ వలీ ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వంటనూనె ప్యాకెట్లు అందజేశారు. విషయం తెలుసుకున్న కూటమి నాయకులు అక్కడికి చేరుకోవడంతో వైసీపీ నాయకులు ఉడాయించారు. దీనిపై కూటమి నాయకులు మండిపడుతున్నారు. వైసీపీ ప్రలోభాలపై ఎన్నికల కమిషనర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వ సాయం అందలేదు. అతివృష్టి, అనావృష్టి, తెగుళ్లతో ఆశించిన దిగుబడి

ప్రభుత్వ సాయం అందలేదు..

రావడం లేదు. ఈ ఏడాది మిరప సాగు చేసి గిట్టుబాటు ధర లేక తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదు.

- బొమ్మన్న, ఒంటారెడ్డిపల్లి, కంబదూరు

ఎందుకు ఇలా చేశారు..?

కౌలు రైతుల ఆవేదన

కళ్యాణదుర్గం, మే 1: 'కౌలు రైతులను ఆదుకుంటాం. వారికి అండగా నిలుస్తాం. గుర్తింపు కార్డులు ఇచ్చి వారికి బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తాం' అని ప్రతిపక్ష నేతగా జగన్మోహన్‌రెడ్డి గొప్పలు చెప్పారు. ఓట్లే వేయించుకుని, అధికారంలోకి వచ్చాక వారిని ఏ మాత్రం పట్టించుకోలేదు. వారి కష్టాన్ని గుర్తించలేదు. కొందరికి సీసీఆర్‌సీ కార్డులు అందలేదు. మరికొందరికి పంట సాగుదారు హక్కు పత్రాలు ఇచ్చినా ఏ మాత్రం ప్రయోజనం చేకూరలేదు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో సుమారు 30 వేల మంది కౌలు రైతులు ఉన్నారు. ఎకరాకు సుమారు రూ. 17 వేలు నుంచి రూ. 24 వేలు వరకు కౌలు చెల్లిస్తున్నారు. అధిక వడ్డీలకు రుణాలు తెచ్చి సాగు చేస్తున్నారు. తీవ్ర వర్షాభావం, తెగుళ్ల కారణంగా పెట్టుబడులు దక్కక, ప్రభుత్వ సాయం అందక కౌలు రైతులు అప్పులు తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.

అందని వడ్డీలేని రుణాలు



కౌలు రైతులకు పంటల బీమా వర్తింపజేస్తామని, వడ్డీలేని రుణాలు ఇస్తామని గత ఎన్నికల సమయంలో వైసీపీ నాయకులు ప్రచారం చేశారు. బ్యాంకులకు వెళితే భూయజమానులకే రుణాలిచ్చేశామని, మళ్లీ మీకు రుణాలు ఇవ్వలేమని చేతులెత్తేశారు. పెట్టుబడులు పెరిగాయి. ఇటు పంటలు చేతికందక అటు ప్రభుత్వ సాయం అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

- రవి, ఒంటారెడ్డిపల్లి, కంబదూరు



ఐదేళ్లుగా కౌలు రైతుల కష్టాలను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. పెట్టుబడులు పెరిగినా పండించిన ధాన్యానికి

సంక్షేమాన్ని మరిచారు

గిట్టుబాటు ధర లభించడం లేదు. తుఫానుతో దెబ్బతిన్న పంటలకు పరిహారం అందలేదు. భూసార పరీక్షల ఊసేలేదు.

- శ్రీనివాసులు, జల్లిపల్లి, కంబదూరు

భారత ఎన్నికల సంఘానికి 74 సంవత్సరాలు

భారత ఎన్నికల సంఘం ఏర్పడి 74 సంవత్సరాలు గడుస్తోంది. భారత ఎన్నికల సంఘం ఓ స్వతంత్ర రాజ్యాంగ వ్యవస్థ. ఎన్నిలకు సంబంధించిన ప్రతి నిర్ణయాన్ని స్వేచ్ఛగా తీసుకుంటుంది. 1950 జనవరి 25న భారత ఎన్నికల సంఘం ఏర్పడింది. దేశ సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఏక కాలంలో దేశ వ్యాప్తంగా దాదాపు 50లక్షల మంది ఉద్యోగుల సేవలను ఎన్నికల సంఘం వినియోగించుకుంటుంది. ఎన్నికల సంఘం ఏర్పాటు అయ్యాక మొదటి సాధారణ ఎన్నికలను హిమాచల్ ప్రదేశ్‌లోని చిని నియోజకవర్గంలో నిర్వహిం చారు. సీనియర్ ఐఏఎస్ అధికారులను ఎన్నికల సంఘం కమిషనర్లుగా రాష్ట్రపతి నియమిస్తారు. ఎన్నికల సంఘానికి పలు అనుబంధ విభాగాలుంటాయి. మొదటి భారత ఎన్నికల సంఘం కమిషనర్‌గా సుకుమార్‌సేన్ నియమితుల య్యారు. అయితే ప్రతి రాష్ట్రానికి కూడా ఒక ఎన్నికల సంఘం ఉంటుంది. ఆసంఘాలన్ని భారత ఎన్నికల సంఘం పరిధిలో విధులు నిర్వహిస్తుంటారు. రెండింటి మధ్య పని విభజన, సమన్వయం, తదితరాంశాలపై పారదర్శకత ఉంటుంది.

- కదిరి అర్బన్



అంతా సర్వేలమయం

గోప్యంగా సమాచార సేకరణ...

అభ్యర్థులకు నివేదికలు ఇస్తున్న సర్వే బృందాలు

హిందూపురం, మే1 : సార్వత్రిక ఎన్నికల్లో విజయతీరాలు చేరేందుకు సర్వేలు కీలకమయ్యాయి. వివిధ సంస్థలతోపాటు అభ్యర్థులు ఏర్పాటు చేసుకున్న సొంత సర్వే ఏజెన్సీలు నియోజకవర్గాల వారిగా ఓటర్ల మనస్తత్వం తెలుసుకునేందుకు జల్లెడ పడుతున్నాయి. సర్వేల ఆధారంగా ఆయా మండలాల్లో అనుకూలత, ప్రతికూలతపై సర్వే సంస్థల ప్రతినిధులు అభ్యర్థులకు నివేదిక ఇస్తున్నారు. ఈ నివేదికల ద్వారా ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే చక్కబెట్టుకునే అవకాశం చిక్కుతుంది. ఈ సర్వే వ్యవహారమంతా గోప్యంగా సాగుతోంది. ఎక్కడ పది మంది గుమిగూడి ఉంటారో వారి వద్ద చర్చలు జరుపుతారు. వారి నుంచి సమాచారం రాబట్టి ఆ మేరకు నివేదికను రూపొందిస్తారు. వృద్ధులు, యువకులు, మహిళలు కొత్తగా ఓటర్లయిన యువత, నిరుద్యోగుల నుంచి అనుకూల, ప్రతికూల అంశాలపై ఆరాతీస్తున్నారు. సర్వేల ద్వారా ప్రత్యర్థుల వ్యూహాలు కూడా తెలుస్తుంటాయి. రాజకీయాలకు సంబంధంలేని సమీప బంధుమిత్రులతో కూడా కొత్త విషయాలు తెలుసుకుని అభ్యర్థులకు వినిపిస్తున్నారు. సర్వేల ద్వారా అభ్యర్థులు తమ విజయానికి ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. ఆయా పార్టీలు ఈసారి ఎక్కువ భాగం సర్వేల ఆధారంగానే అభ్యర్థులను ప్రకటించాయి. అధికార పార్టీ తాము చేసిన పనులు, ప్రస్తుత పరిస్థితులు, అనుకూల, ప్రతికూలతలను ఆరాతీస్తున్నట్లు సమాచారం. ప్రతికూల అంశాల వివరాలను సేకరించేందుకు సర్వేలో ముమ్మరం

చేరికలు, అలకలపై దృష్టి



చేశాయి.

సర్వ బృందాలు ఓటర్లనాడి తెలుసుకోవడమేకాక ప్రస్తుత ఎన్నికల్లో పార్టీల బలాలు, బలహీనతలను గుర్తిస్తున్నాయి. సర్వే బృందం పనిచేసే పార్టీ ఎక్కడైనా బలహీనంగా ఉంటే అక్కడ ప్రత్యర్థి పార్టీ నుంచి ఎవరైనా నాయకులు వస్తారా..? వస్తే ఎంతమేర మేలు చేకూరుతుంది.. వారికి ఆర్థిక వనరులు, భవిష్యత్తులో పార్టీ నుంచి వారికి ఏవిధంగా ఉపయోగం ఉంటుందో సర్వేబృందాలు వివరిస్తూ మధ్యవర్తులుగా కూడా వ్యవహరిస్తున్నాయి. అధికార పార్టీకి సర్వే చేస్తున్న బృందాల ప్రతినిధులు వీటిపై ఎక్కువగా దృష్టి పెట్టారు. మరీ ముఖ్యంగా పార్టీలో అలిగినవారి వివరాలు ఆరాతీసి వారు ఎందుకు మౌనంగా ఉన్నారో సన్నిహితుల ద్వారా తెలుసుకుని ఎప్పటికప్పుడు అభ్యర్థులకు చేరవేస్తున్నారు.

గంట వ్యవధిలో అటూ .. ఇటూ...

రాప్తాడు, మే 1: మండలకేంద్రానికి చెందిన పెద్దన్నను బుధవారం ఉదయం తోపుదుర్తి నయనతా రెడ్డి బలవంతంగా వైసీపీ కండువా కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. బలవంతంగా పార్టీలోకి చేర్చుకోవడం నచ్చని పెద్దన్న గంట తరువాత టీడీపీ మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో కన్వీనర్ కొండప్ప, శివ పాల్గొన్నారు.



ధర్మవరపు మురళి ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరిన పెద్దన్న



బూదగవి వద్ద చీకలగుర్కి గ్రామానికి వెళ్లే దారిలో శిథిలమైన బ్రిడ్జి

అన్నీ గాలి మాటలే..!

పనులు చేశాకే ఓట్లు అడుగుతామన్న వైసీపీ నాయకులు

ఐదేళ్లలో గ్రామాల వైపు తిరిగి చూడని వైనం

ఇప్పుడు మళ్లీ ఓట్లు అడుగుతుండటంపై ప్రజల ఆగ్రహం

విడపనకల్లు, మే 1: మండలంలోని చీకలగుర్కి గ్రామానికి వెళ్లే రహదారి పనులు చేసి, బ్రిడ్జి నిర్మాణం చేపట్టిన తరువాతనే ప్రజలను ఓట్లు అడుగుతామని వైసీపీ నేత విశ్వేశ్వరరెడ్డి గత ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. కాని రోడ్డుపై ఒక్క గంప కంకరవేయలేదు, ఒక్క గంప ఇసుక వేయలేదు. చీకలగుర్కి గ్రామానికి బ్రిడ్జి నిర్మాణం చేపట్టి, రోడ్డు వేస్తామన్న నాయకుడు ఆపనులు చేయకుండానే, మళ్లీ తనకు ఓటు వేయాలని ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండటంపై ఆ ఊరి ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

● పెద్ద కొట్టాలపల్లి చీకలగురికి, మాళాపురం, బూదగవి, వెలిగొండ, కరకముక్కల గ్రామాలకు హంద్రీనీవా కాలువ ద్వారా సాగు నీరు అందించి దాదాపుగా 20వేల ఎకరాలకు సాగు నీరు అందిస్తామన్న వైసీపీ నాయకు లు కాలువ పనులు చేయకుండా ఐదేళ్ల గడిపేశారు. టీడీపీ పాలనలో కొట్టాలపల్లి వద్ద జాతీయ రహదారిపై బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టారు ప్రభుత్వం మారటంతో ఆ పనులు ఆగిపోయాయి. పొలాల్లో తవ్విన కాలువల్లో ముళ్ల పొదలు పెరిగి పోయి, కాలువలు పూడి పోతున్నాయి. కనీసం ఒక్క ఎకరానికికూడా సాగు నీరు అందివ్వలేదు.

● గడేకల్లు గ్రామంలో జాతీయ రాహదారి పనులు నిలిపివేసి ఆరు సంవత్సరాలు అయింది. గ్రామస్థులు రాస్తారోకోలు, ధర్నాలు చేసినా అధికార పార్టీ నాయకులు పట్టించుకోలేదు. మాటలు చెప్పి ఓటర్లను నిలువునా మోసం చేయటం వైసీపీ నైజంగా మారిందని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

● విడపనకల్లు మండలంలో ప్రధాన సాగునీటి వనరు జీబీసీ. దీని కింద వేల ఎకరాల్లో మిర్చి పంటలు సాగు చేస్తుంటారు. కానీ జీబీసీకి కూడా పూర్తి స్థాయిలో సాగు నీరు అందివ్వక పోవటంతో మిర్చి రైతులు వందల కోట్ల రూపాయలు పంటలు నష్ట పోయారు.

రోడ్లు, బ్రిడ్జి నిర్మాణం తర్వాతే ఓట్లు అడుగుతామన్నారు



చీకలగుర్కి గ్రామానికి రోడ్డు, బ్రిడ్జి నిర్మించిన తరువాతనే ఓట్లు అడుగుతామన్నారు. కానీ ఆ హామీ నేటికీ నెరవేరలేదు. మా గ్రామానికి రోడ్డు లేక రావాలంటేనే ఇబ్బందిగా ఉంది. బ్రిడ్జిలు కూలి పోయాయి. రోడ్లు అధ్వానంగా మారాయి. ఇచ్చిన మాట నెరవేర్చకున్నా మళ్లీ ఓట్లు అడిగేందుకు గ్రామానికి రావడం దారుణం.

- పద్మావతి, చీకలగుర్కి సర్పంచ్

ఇచ్చిన మాట మరిచిపోయారు



మా పొలంలోనే హంద్రీనీవా కాలువను తవ్వారు. సాగు నీరు వస్తే పంటలకు నీటి తడులు అందించి అప్పుల బాధ నుంచి బయట పడాలి అనుకుంటే వైసీపీ నాయకులు హంద్రీనీవాకు చుక్కనీరు ఇవ్వలేక పోయారు. పనులు చేసి ఉంటే కాలువకు సాగు నీరు వచ్చేది. బిందెలతో నీటిని పోసి మిరప పంటలను కాపాడుకున్నాము. హంద్రీనీవాకు సాగు నీరు అందించిన తరువాతనే ఓట్లు అడుగుతామన్న వైపీసీ నాయకులు ఆ మాటను మరిచిపోయారు.

- బొజ్జప్ప, రైతు, చీకలగుర్కి



చీకలగుర్కి పొలాల్లో పిల్లకాలువను తవ్వి వదిలేసిన దృశ్యం

ఐదేళ్లు గడిచినా రోడ్డు పనులు చేపట్టలేదు



గడేకల్లులో జాతీయ రహదారి పనులు నిలిపివేసి ఆరేళ్లవుతోంది. ఇప్పటి వరకూ ఎవరూ పట్టించుకోలేదు. ఎన్నో సార్లు ధర్నాలు, రాస్తారోకోలు చేసినా అధికార పార్టీ నాయకుల్లో చలనం రాలేదు. గత ఐదు సంవత్సరాలు రోడ్డును పట్టించుకోలేదు. దుమ్మూ, ధూళికి ప్రజలు రోగాల పాలవుతున్నా రు. రోడ్లు వేయిస్తామన్న నాయకులు ఐదేళ్లలో ఒక్కరు కూడా ఇటు వైపు తిరిగి చూడలేదు. ఇప్పుడు మాత్రం మేం అభివృద్ధి చేశాం. మాకు ఓటు వేయండి అంటూ వైసీపీ నాయకులు గ్రామాల్లో తిరుగుతున్నారు.

- చక్రవర్తి, గడేకల్లు



చీకలగుర్కి గ్రామం వద్ద దెబ్బతిన్న బ్రిడ్జి



మూతపడ్డ అనంతపురం డెయిరీ





పాడుబడిన నీటినిల్వ తొట్టెలు



అనంతపురం డెయిరీ ముఖద్వారం

అట్లుంది... జగన్ పాలన..!

టీడీపీ ప్రభుత్వంలో పాలవెల్లువ

రోజుకు లక్షల లీటర్ల పాలను

సేకరించిన అనంతపురం డెయిరీ

ఆర్థిక సాధికారతను సాధించిన పాడి రైతులు

జగన్ రాగానే డెయిరీ మూత

'పాడి'రైతుల పొట్టకొట్టిన ప్రభుత్వం

అనంతపురం సెంట్రల్, మే 1: రైతులకు వ్యయసాయంతో పాటు పాడి అదనపు ఆదాయ వనరు. చాలామంది రైతులు అనంతపురం డెయిరీకి పాలు పోసి ప్రతివారం బిల్లులు పొందేవారు. తద్వారా పిల్లల చదవులు, ఇంటి అవసరాలను పాల డబ్బులతో తీర్చుకునేవారు. ఈ క్రమంలో టీడీపీ ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పాలవెల్లువ పొంగిపొర్లిందని పాడిరైతులు గుర్తుచేసుకుంటున్నారు. ఒక్క చాన్స్ ఇవ్వండని బతిమాలిన జగన్‌కు ఓటేసి గెలిపిస్తే.. ఏకంగా డెయిరీనే మూతవేయించారని రైతులు మండిపడుతున్నారు. పాడిరైతుల కష్టాన్ని కార్పొరేట్‌కు అమ్ముకుని కోట్లు కొల్లగొట్టేందుకు అమూల్ సంస్థను తీసుకువచ్చిన జగన్.. తమ కడుపులు కొట్టారని వాపోతున్నారు. మరోసారి జగన్ అధికారంలోకి వస్తే డెయిరీ ఆస్తులను అమ్ముకుని జేబు నింపుకోవడం ఖాయమని పాడిరైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

32 బీఎంసీయూల ఏర్పాటు...

ఉమ్మడి జిల్లాలో 63 మండలాల వ్యాప్తంగా 32 బీఎంసీయూ (బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్)లను ఏర్పాటు చేశారు. యూనిట్ల పరిధిలోని గ్రామాల్లో పాడిరైతుల ద్వారా సేకరించిన పాలను ఎప్పటికప్పుడు బీఎంసీయూలకు తరలించి కూలింగ్ చేసేవారు. అక్కడి నుంచి ట్యాంకర్ల ద్వారా డెయిరీ ప్లాంట్‌కు రవాణాచేసేవారు. ప్రాసెస్‌ను పూర్తిచేసిన అనంతరం పాల ప్యాకెట్లను తయారుచేసి మార్కెట్‌కు తరలించేవారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత డెయిరీతోపాటు బీఎంసీయూలు మూతపడ్డాయి. దీంతో ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా తమ కష్టార్జితంతో పోగుచేసిన రూ.కోట్ల విలువచేసే బీఎంసీయూ, డెయిరీ ప్లాంట్ యంత్రాలు, పరికరాలు తుప్పుపట్టాయని పాడిరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన జగన్ తన సామాజిక వర్గానికి చెందిన కొందరి వ్యక్తులకు పాల వ్యాపారంలో అడ్డుకాకూడదనే దురుద్దేశంతోనే డెయిరీని మూతయించారని రైతులు మండిపడుతున్నారు

పేదలకు మేని ఫెస్ట్

కూటమి మేనిఫెస్టోపై పలువురి హర్షం

వైసీపీ పాలనతో విసిగి పోయిన ప్రజలు నూతన ప్రభుత్వం కోసం ఎదురు చూస్తున్నారు. ఈక్రమంలోనే రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ఈ సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన వ్యవస్థాపకుడు పవన్ కల్యాణ్ తమ కూటమి అధికారంలోకి వస్తే చేయబోయే పనుల గురించి హామీ ఇస్తూ ఉమ్మడి మేనిఫెస్టో విడుదల చేశారు. ఈ మేనిఫెస్టో పట్ల జనం నుంచి సానుకూలత వ్యక్తం అవుతోంది.

- అనంతపురం సెంట్రల్

బస్సులో ఉచితంగా పోవచ్చు



నా బిడ్డకి బాగలేకుంటే పెద్దాసుపత్రికి వచ్చినాం. మా ఊరినుంచి అనంతపురం రావడానికి బస్సులో రూ.200 టికెట్ తీసుకున్నారు. తిరిగి పోవాలంటే మళ్లీ రూ.200 టికెట్‌కి పెట్టాలి. మాలాంటి పేద వాళ్ల ఈ చార్జీలు భరించలేము. చంద్రబాబు సీఎం అయినాక ఆడోళ్లందరూ ఉచితంగా బస్సుల్లో పోవచ్చంట కదా! మూడు గ్యాస్ సిలిండర్లు ఫ్రీగా ఇస్తామంటున్నారు. పించన్ రూ.4వేలకు పెంచుతామన్నారు. ఇవన్నీ వస్తే మాలాంటోళ్లకు మంచి జరుగుతుంది.

- వన్నూరమ్మ, యర్రగుంట

పిల్లలను బాగా చదివించవచ్చు..



అమ్మ ఒడి ఇస్తున్నామని చెబుతున్న మాటలన్నీ అబద్ధమే. నాకు ఇద్దరు పిల్లలుంటే ఒక్కరికి కూడా అమ్మఒడి రాలేదు. వలంటీర్‌ని అడిగి అడిగి సాలైపోయింది. ఎన్ని సార్లు సచివాలయం చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు. కూలి పనులకెళ్లి చదివించుకుంటున్నాం. టీడీపీ, జనసేన ప్రభుత్వం వచ్చినాక ఇంట్లో ఎంత మంది ఉన్నా ఒక్కక్కరికి రూ.15వేలు ఇస్తారంట. దీంతో పిల్లలను బాగా చదివించవచ్చు. ఈ పథకం తొందరగా రావాలని మాలాంటి పేదవాళ్లందరూ ఎదురుచూస్తున్నారు.

- భాగ్యమ్మ, గులుగుండపల్లి

కార్మికులు బాగుపడుతారు



పెరిగిన ధరలతో నెల గడవాలంటే కనీసం రూ.30వేలు కావాలి. పనిదొరికితేగాని కూలిరాని మాలాంటి కార్మికులు చాలా ఇబ్బందులు పడు తున్నాము. గతంలో పనిముట్లు ఇచ్చేవారు. పిల్లల చదువులు, పెళ్లిలకు ఆర్థిక సాయమందించారు. స్వయం ఉపాధికి ఆర్థికసాయం, మహిళలకు నెలకు రూ.1500, కరెంట్ చార్జీల తగ్గింపు, పనిముట్ల అందజేత తదితర పథకాలు అమలుచేస్తామని చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ కొత్త మేనిఫెస్టోను విడుదల చేశారు. వీళ్ల ప్రభుత్వం వచ్చి ఈ పథకాలు అమలైతే కార్మికులు బాగుపడుతారు.

- ఖాసీం, వడ్రంగి కార్మికుడు

రుణాలు, రాయితీల్లేవు..



మాలాంటి చిరువ్యాపారులు పెట్టుబడి పెట్టేందుకు రుణాలు, రాయితీలు ఇవ్వడంలేదు. స్వయం ఉపాధి పొందాలనుకునే వారికి ఈ రెండు చాలా అవసరం. పన్నులు, అద్దెలు, కరెంట్ బిల్లులు, ట్రాన్స్‌పోర్ట్ ఇలా ఖర్చులన్నీ తడిసి మోపెడవుతున్నాయి. స్వయం ఉపాధి కింద చిరువ్యాపారులను ప్రోత్సహిస్తామని, కార్పొరేషన్‌ల ఏర్పాటు, సబ్‌ప్లాన్‌కు నిధులు వంటి ఎన్‌డీఏ కమిటీ మేనిఫెస్టో అమలు కావాల్సిన అవసరముంది.

- అజయ్, చిరువ్యాపారి



ఊరు అంత ఇచ్చింది..
మీరేమి చేశారు..?



- కనీస సౌకర్యాలు కరువైన తోపుదుర్తి
- తాగునీటికి తప్పని తిప్పలు
- అస్తవ్యస్తంగా డ్రైనేజీ
- కలగానే 'తోపుదుర్తి' ప్రాజెక్టు
- రాప్తాడు ఎమ్మెల్యే సొంత గ్రామంలో సమస్యల తిష్ట



రాప్తాడు నియోజకవర్గంలోని తోపుదుర్తి గ్రామానికి ప్రత్యేకత ఉంది. ఆ గ్రామ నాయకుల అసలు ఇంటి పేరు పక్కకుపోయి ఊరి పేరే ఇంటి పేరుగా మారింది. ఆ గ్రామం నుంచి సమితి అధ్యక్షుడు మొదలు.. ఎమ్మెల్యే, జడ్పీ చైర్‌పర్సన్ వరకు ఎన్నో పదవులు అనుభవించారు. సొంత గ్రామ అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకున్న దాఖలాలు లేవు. కనీస సౌకర్యాలు లేక గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఎన్నో హామీలు ఇచ్చారు. వాళ్ల పార్టీనే అధికారంలో ఉన్నా తోపుదుర్తి కోసం చేసిందేమీ లేదని గ్రామస్థులు మండిపడుతున్నారు.

ఆత్మకూరు, మే 1 : రాప్తాడు నియోజకవర్గంలోని తోపుదుర్తికి ప్రత్యేకత ఉంది. ఆ గ్రామానికి చెందిన ప్రస్తుత ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డితో పాటు గతంలో ఎంతో మంది ప్రాతినిధ్యం వహించినా కనీస సౌకర్యాలు లేక గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. తోపుదుర్తి గ్రామ పంచాయతీగా ఏర్పాటయినప్పటి నుంచి సమస్యలు అలాగే ఉన్నాయి. తోపుదుర్తి కుటుంబీకులే పాలించినా అభివృద్ధిపై దృష్టి సారించలేదని గ్రామస్థులు మండిపడుతున్నారు. తాతల నుంచి మనవళ్ల వరకు.. గ్రామం నుంచి రాష్ట్రం వరకు ఎన్నో పదవులు అనుభవించినా గ్రామ రూపు రేఖలు మారలేదు. జిల్లా కేంద్రానికి సమీపాన ఉన్నా గ్రామ అభివృద్ధిలో వెనుకబడే ఉంది. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సొంత గ్రామం తోపుదుర్తిలో 950 కుటుంబాలు ఉన్నాయి. 3500 మంది జనాభా, 2800మంది ఓటర్లు ఉన్నారు. గ్రామంలో కనీస మౌలిక సదుపాయాలు కూడా లేవు. నీటి కష్టాలు నిత్యం తప్పడం లేదు. పారిశుధ్యం కూడా అంతంత మాత్రమే. గ్రామంలో అడిగే వారు లేరు. ప్రభుత్వ అధికారులు పట్టించుకోరు, పాలకులు ఇటువైపు చూడరు. గత ఎన్నికలు ముందు నా గ్రామం అంటూ ప్రచారంలో ఊదరగొట్టిన ప్రకాష్‌రెడ్డి తర్వాత పట్టించుకోలేదని గ్రామస్థులు మండిపడుతున్నారు.



'తోపుదుర్తి' కుటుంబానికి వచ్చిన పదవులు

తోపుదుర్తి రామచంద్రారెడ్డి : సమితి అధ్యక్షుడు
తోపుదుర్తి భాస్కరరెడ్డి : మండల పరిషత్ అధ్యక్షుడు
తోపుదుర్తి కవిత : జిల్లా పరిషత్ చైర్‌పర్సన్
తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి : సింగిల్‌విండో అధ్యక్షుడు
తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి : రాప్తాడు ఎమ్మెల్యే

వెంటాడుతున్న తాగునీటి సమస్య

తోపుదుర్తి గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. బీసీ కాలనీ, పీర్లచావిడి వీధి తదితర ప్రాంతాల్లో నీటి సమస్య అధికంగా ఉంది. పీర్లచావి వీధిలో నీటి ట్యాంకు వృథాగా ఉంది. అరకొర నీటితో కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారు. బీసీ కాలనీకి నీటి సరఫరా చేయాల్సిన బోరు వ్యవసాయానికి వాడుకోవడంతో గ్రామంలో నీటికొరత అధికంగా ఉంది. సత్యసాయి ద్వారా వచ్చే అరకొర నీటితో సర్దుకుంటున్నారు. పాలకులు నిర్లక్ష్యం కారణంగా శశ్వాత పరిష్కారం లేక పోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పీర్లచావిడి వీధిలో నిరుపయోగంగా తాగునీటి ట్యాంకు

అభివృద్ధికి నోచుకోని పాఠశాల

ప్రాథమిక పాఠశాల పరిస్థితి మరీ దారుణంగా తయారయింది. నాడు-నేడు ద్వారా చేపట్టిన పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. పాలకులు పట్టించుకోకపోవడంతో పాఠశాల అభివృద్ధి నిలిచిపోయింది. అదనపుగది నిర్మాణం అసంపూర్తిగానే ఉంది. విద్యార్థులకు తగిన సౌకర్యాలు కల్పించలేదు.

అసంపూర్తిగా జగనన్న కాలనీ

జగన్న కాలనీ అసంపూర్తిగానే ఉంది. 200 కుటుంబాలుకు పట్టాలు మంజూరు చేసినా 50 మంది వరకు ఇళ్లు పూర్తి చేసుకున్నారు. మరో 36 మందికి ఎమ్మెల్యే రాంక్రీట్ సంస్థ నిర్మాణం చేపట్టగా అవి కూడా అసంపూర్తిగానే ఉన్నాయి. సొంత గ్రామంలోనే ఇళ్లు పూర్తిచేయని ఆయన రాష్ట్రంలో ఎన్ని ఇళ్లు పూర్తి చేశారని విమర్శిస్తున్నారు.

కాగితాల్లోనే తోపుదుర్తి ప్రాజెక్టు

పెద్ద చెరువు, చిన్న చెరవు స్థానంలో తోపుదుర్తి ప్రాజెక్టు కలగానే మిగిలిపోయింది. ఐదేళ్లలో ఊదర గొట్టడం తప్ప తట్టెడు మట్టి తీసింది లేదు. కనీసం వెయ్యి ఎకరాలు భూసేకరణ చేయాల్సి ఉండగా.. ఒక్క ఎకరం కూడా సేకరించలేదు. గ్రామానికి ప్రాజెక్టు నిర్మించి అంకితం చేస్తామని హామీ ఇచ్చి మరోసారి ఎమ్మెల్యేగా నామినేషన్ వేసినా అతీగతి లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

అస్తవ్యస్తంగా డ్రైనేజీ

వీధుల్లో మురికినీరు రోడ్లపై పారడంతో ప్రజలు చీదరించుకుంటున్నారు. రెడ్డి వీధి, ముత్యాలమ్మగుడి, పీర్లచావి వీధి, పలు వీధుల్లో మురికి నీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. ఎమ్మెల్యే ఇంటి సమీపాన డ్రైనేజీ లేక మురికి నీరు రోడ్లపై పారి దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీసీ కాలనీలో ప్రధాన రోడ్లుకు డ్రైనేజీలు ఏర్పాటు చేయక పోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.



డ్రైనేజీ లేక పోవడంతో రోడ్లపై పారుతున్న మురుగు నీరు

ఊరందరిదీ ఒకే మాట



మా గ్రామంలో అందరు వ్యవసాయంతోనే బతుకుతున్నాం. ఏదైనా ఎలక్షన్ వస్తే గ్రామానికి చెందిన ప్రజలు, రైతులందరిదీ ఒకటే మాట. దానికి కట్టుబడి ఓటేస్తాం. నాకు ఓటు హక్కు వచ్చినప్పటి నుంచి గడిచిన 20 ఏళ్ల వరకు ఎలక్షన్‌లు వస్తే పోటీ చేసే అభ్యర్థులు మొదట గ్రామ రచ్చకట్ట వద్దకు వచ్చి మీ గ్రామంలో సమస్య లు పరిష్కరిస్తాం. మీ అందరూ మాకు ఓట్లు వేయాలని అడిగేవారు. తరువాత ప్రజలు, రైతులు అందరూ కలిసి మాట్లాడి ఫలానా వ్యక్తికి ఓట్లు వేద్దామని నిర్ణయించేవారు. వారు చెప్పినట్లే మిగతా గ్రామస్థులు వినేవారు. ఇప్పటి రాజకీయాలు చాలా దారుణంగా మారాయి. డబ్బుకు, సారాకు లొంగి ఓట్లు వేస్తున్నారు. గతంలో గెలిచినవారు గ్రామంలోకి వచ్చి ఇచ్చిన హామీలను నెలవేర్చేవారు. ఇప్పుడు గెలిచాక గ్రామం మొఖం కూడా చూడటం లేదు.

- శింగనమల

ఉక్కిరిబిక్కిరి
అంగన్‌వాడీ కేంద్రాలకు కరెంట్ కట్



ఎండలు మండిపోతున్నాయి. ఉక్కపోతతో జనాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. చిన్నారులు, వృద్ధులైతే ఎప్పుడు పడిపోతారో అన్నట్లుగా పరిస్థితి ఉంది. ఇలాంటి సమయంలో బకాయిలు చెల్లించలేదని అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్‌శాఖ అధికారులు కరెంట్ కట్ చేశారు. ఒక్కో అంగన్‌వాడీ కేంద్రానికి వేలల్లో విద్యుత్ బకాయిలు ఉండటంతో విద్యుత్‌శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కరెంట్ కనెక్షన్లు కట్ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ఉక్కపోతతో చిన్నారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫ్యాన్లు తిరగక పోతే చిన్నారులు తట్టుకోలేకపోతున్నారు. మండలంలోని దేవగిరిక్రాస్, నేమకల్లు గ్రామాలలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ఫ్యాన్లు తిరగకుండా ఆగిపోయాయి. దీంతో ఆ చిన్నారులు ఉక్కపోతతో అల్లాడిపోతూ కేంద్రాల్లో ఉండకుండా ఇంటికి వెళ్లి పోతున్నారు.

-బొమ్మనహాళ్



పుట్టపర్తి అంటే ప్రపంచ చిత్ర పటంలోనే ప్రత్యేక గుర్తింపు కలిగి ఉంది. సత్యసాయిబాబా ఆధ్యాత్మిక ప్రసంగాలతో ఎందరో విదేశీ భక్తులను సొంతం చేసుకున్నారు. ఆయన సేవలు ప్రపంచ స్థాయిలో ఉండటంతో పుట్టపర్తి కీర్తి నలు దిశలా వ్యాపించింది. సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి, ఇండోర్ స్టేడియం, విమానాశ్రయం, నక్షత్రశాల.. ఇలా ఎన్నో ప్రత్యేకతలు సంతరించుకుంది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక పుట్టపర్తిని జిల్లా కేంద్రంగా చేశారు కానీ అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదు. దాదాపు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి.




ఆధ్యాత్మిక ప్రపంచం



నియోజకవర్గ చరిత్ర

- అంతర్జాతీయ స్థాయిలో సత్యసాయి సేవలు
- విద్య, వైద్యంలో ప్రత్యేకత
- భక్తుల కోసం విమానాశ్రయం
- అపర భగీరథుడిగా నిలిచిన బాబా
- జిల్లా కేంద్రమైనా పుట్టపర్తిలో కానరాని అభివృద్ధి



పుట్టపర్తి, మే 1 : సత్యసాయి అవతరించిన పుట్టపర్తి ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు పొందింది. అరవై సంవత్సరాల క్రితం వందలోపు గృహాలున్న చిన్న కుగ్రామం. సత్యసాయి బోధనలు, ఆధ్యాత్మిక ప్రసంగాలతో ప్రపంచస్థాయి కీర్తి గడించింది. సత్యసాయి సేవలను గుర్తించి పునర్విభజన సందర్భంగా 2009లో పుట్టపర్తి నియోజకవర్గాన్ని ఏర్పాటు చేశారు. గోరంట్ల, నల్లమాడ నియోజకవర్గాలను రద్దుచేసి వీటి పరిధిలో ఉన్న పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు, నల్లమాడ, ఓబుళదేవరచెరువు, అమడగూరు మండలాలను కలుపుతూ నియోజకవర్గాన్ని ఏర్పాటు చేశారు. గ్రామపంచాయతీగా ఉన్న పుట్టపర్తిని 2011 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేశారు. 11 సంవత్సరాల తర్వాత పుట్టపర్తిని జిల్లా కేంద్రంగా చేశారు. దీంతో పుట్టపర్తికి మరింత గుర్తింపు వచ్చింది. నియోజకవర్గంలో 2.52 లక్షల జనాబా ఉండగా.. 2,09,345 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 1,03,405 మంది పురుషులు, 1,05,928 మహిళా ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గంలో బీసీ ఓటర్లదే ఆధిక్యత. 46వేల హెక్టార్ల సాగుభూమి ఉంది. వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. వేరుశనగ, వరి, మొక్కజొన్న, ప్రధాన పంటలు. వర్షాధారంతో పంటలు సరిగా పండక ఎక్కువ మంది రైతులు వ్యవసాయాన్ని వదులుకుని కర్ణాటకకు వలస వెళ్లారు.

విశేషాల పుట్ట

పుట్టపర్తి నియోజకవర్గంలో అనేక విశేషాలు ఉన్నాయి. ఇందులో రాయలసీమలోనే అతిపెద్ద బుక్కపట్నం చెరువు ఉంది. 3,700 ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తోంది. నియోజకవర్గంలో దాదాపు 17వేల హెక్టార్లు అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. సత్యసాయి పేరిట ఎయిర్‌పోర్టు, రైల్వేస్టేషన్, ఆంధ్రప్రదేశ్‌లోనే అతిపెద్ద మొత్తంలో విదేశీ మారక ద్రవ్యాన్ని అందచేస్తూ 157దేశాల నుంచి విదేశీ భక్తులను ఆకర్షిస్తూ పుట్టపర్తి ప్రత్యేకతను చాటుతోంది. అత్యాధునిక వైద్య సదుపాయాలతో సత్యసాయి బాబా సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం ద్వారా అత్యంత ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నారు. చిత్రావతి నది ప్రవహిస్తోంది. టీడీపీ ప్రభుత్వం హయాంలో బుక్కపట్నం మండలం మారాల వద్ద ఒక టీఎంసీ నీటి పరిమాణంతో మారాల రిజర్వాయర్ నిర్మించారు. చిత్రావతిపై చెక్‌డ్యాం నిర్మాణంతో పుట్టపర్తి దాహార్తి తీరింది. అప్పటి మంత్రి పల్లె రఘునాథరెడ్డి కృషితో పుట్టపర్తికి తాగునీటి అవసరాలు శాశ్వతంగా పరిష్కారమయ్యాయి.

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి

పేదలందరికి అతి ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా అందించేందుకు 1992లో సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించారు. పుట్టపర్తి, బెంగుళూరు ఆసుపత్రుల ద్వారా సుమారు 25లక్షల మందికి పైగా ఉచిత వైద్యాన్ని అందించి సత్యసాయి వైద్యో నారాయణ అనే ఖ్యాతి గడించారు.

అపర భగీరథుడు సత్యసాయి

గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు 1995లో అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు చేతులు మీదుగా తాగునీటి ప్రాజెక్టును ప్రారంభించారు. పుట్టపర్తి నియోజకవర్గానికే కాక జిల్లాలోని 700 గ్రామాలకు తాగు నీరు అందిస్తూ సత్యసాయి అపర భగీరథుడిగా నిలిచారు.

నాటి గొల్లపల్లే నేటి పుట్టపర్తి

పుట్టపర్తిని నాడు గొల్లపల్లిగా పిలిచేవారు. వంద గృహాలకు లోపే ఉన్న గొల్లపల్లిలో పుట్టలు ఎక్కుగా ఉండేవని పూర్వీకులు చెబుతున్నారు. ఆచరణలో గొల్లపల్లి కాస్తా పుట్టపర్తిగా మారింది. సత్యసాయి అవతరణతో పుట్టపర్తి ఆధ్మాత్మిక కేంద్రంగా అవతరించింది. ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందింది.

భక్తుల కోసం ఎయిర్‌పోర్టు

సత్యసాయి దర్శనానికి వచ్చే భక్తుల కోసం మూడు దశాబ్దాల క్రితమే విమానాశ్రయం నిర్మించారు. విదేశీ భక్తులు ముంబాయి నుంచి నేరుగా పుట్టపర్తిలో దిగే విధంగా రవాణా సౌకర్యం కల్పించారు. అప్పట్లో ముంబాయి- పుట్టపర్తి, పుట్టపర్తి- చెన్నై విమాన సర్వీసులు నడిచేవి.

జిల్లా కేంద్రంగా ఏర్పాటు

జిల్లాల పునర్విభజనలో భాగంగా 2022 ఏప్రిల్ 4న శ్రీసత్యసాయి పేరిట కొత్తజిల్లా ఆవిర్భవించింది. దీంతో పుట్టపర్తికి మరింత గుర్తింపు వచ్చినట్లయింది.

గోరంట్ల ఎమ్మెల్యేలు

1957	పూల వెంకటరమణప్ప	కాంగ్రెస్
1966	సోమగట్ట బయ్యపురెడ్డి	కాంగ్రెస్
1967	పద్మాభాస్కర్‌రెడ్డి	కాంగ్రెస్
1972	పాముదుర్తి రవీంద్రరెడ్డి	కాంగ్రెస్
1978	జి. బయ్యపురెడ్డి	కాంగ్రెస్
1983	డాక్టర్ వి. కేశన్న	టీడీపీ
1985	డాక్టర్ వి. కేశన్న	టీడీపీ
1989	పాముదుర్తి రవీంద్రరెడ్డి	కాంగ్రెస్
1995	నిమ్మల కిష్టప్ప	టీడీపీ
1999	నిమ్మల కిష్టప్ప	టీడీపీ
2004	పాముదుర్తి రవీంద్రరెడ్డి	కాంగ్రెస్

నల్లమాడ ఎమ్మెల్యేలు

1955	బయ్యపురెడ్డి	కాంగ్రెస్
1962	వై. పాపిరెడ్డి	స్వతంత్రుడు
1967	కె. రామచంద్రరెడ్డి	కాంగ్రెస్
1972	అగిశం వీరప్ప	కాంగ్రెస్
1978	అగిశం వీరప్ప	కాంగ్రెస్ ఐ
1983	కె. రామచంద్రారెడ్డి	టీడీపీ
1985	సద్దేపల్లి వెంకటరెడ్డి	టీడీపీ
1989	అగిశం వీరప్ప	కాంగ్రెస్
1994	టీడీ నాగరాజరెడ్డి	టీడీపీ
1999	పల్లె రఘునాథరెడ్డి	టీడీపీ
2004	కడపల మోహన్‌రెడ్డి	కాంగ్రెస్

పుట్టపర్తి తొలి ఎమ్మెల్యే 'పల్లె'



పుట్టపర్తి ప్రథమ ఎమ్మెల్యేగా పల్లె రఘునాథరెడ్డి గెలుపొందారు. పుట్టపర్తి నియోజకవర్గం 2009 ఏర్పడింది. ఆయన రెండు మార్లు శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. 1999లో మొదటిసారి ఆయన నల్లమాడ ఎమ్మెల్యేగా గెలుపొందారు. రాజకీయాల్లోకి రాక ముందు అనంతపురం ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో 18 సంవత్సరాలు లెక్చరర్‌గా పనిచేశారు. తర్వాత విద్యాసంస్థలు స్థాపించి ఉమ్మడి జిల్లాలో దాదాపు 50 విద్యాసంస్థలను నడుపుతూ లక్షల మంది విద్యార్థులకు విద్యనందించారు.

హ్యాట్రిక్ ఎమ్మెల్యేలు

గోరంట్ల, నల్లమాడ, పుట్టపర్తి నియోజకవర్గాల్లో అగిశం వీరప్ప, పాముదుర్తి రవీంద్రరెడ్డి మూడు మార్లు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. అగిశం వీరప్ప, నిమ్మల కిష్టప్ప, పద్మాభాస్కరరెడ్డి ఉమ్మడి రాష్ట్రంలో కేబినెట్ మంత్రులుగా పనిచేశారు. పల్లెరఘునాథరెడ్డి మంత్రిగా, చీఫ్ విప్‌గా, ఎమ్మెల్సీగా పనిచేశారు. కె.రామచంద్రారెడ్డి నల్లమాడ నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా, హిందూపురం నుంచి ఒకసారి ఎంపీగా గెలుపొందారు.



కల్పవృక్షం

ప్రధాన సమస్యలు

పుట్టపర్తి నియోజకవర్గంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. వైసీపీ ప్రభుత్వం రెండేళ్ల క్రితం శ్రీసత్యసాయి జిల్లాను ఏర్పాటు చేసింది. అభివృద్ధి మాత్రం శూన్యం. పరిశ్రమల ఏర్పాటు కోసం వందల ఎకరాల భూమిని సేకరించినా ఒక్క పరిశ్రమ వచ్చిన దాఖలాలు లేవు. పట్టణంలో భూగర్భ డ్రైనేజీ సమస్య నెలకొంది. బుక్కపట్నంచెరువు ముంపు రైతులకు పరిహారం ఇస్తామంటూ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఇచ్చిన హామీ.. హామీగానే మిగిలిపోయింది. బుక్కపట్నంలో ఐదుసంవత్సరాలుగా నిర్మాణంలో ఉన్న డిగ్రీ కళాశాల భవనం పూర్తి కాలేదు. కొత్తచెరువు మండలం ఇరగంపల్లి తలమర్ల రోడ్లకు కంకర వేసి వదిలేశారు. కొత్తచెరువు గోరంట్లపల్లి రోడ్డుకు నిధులు మంజూరైనా పనులు పూర్తికాలేదు. బాలికల వసతిగృహం నిర్మించి దశాబ్దాలు గడిచినా వాడుకలోకి రాలేదు. పీహెచ్ స్థాయినుంచి సీహెచ్ స్థాయికి ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేశారు. రూ.3.6 కోట్లు నిధుల మంజూరైనా పనులు పూర్తికాలేదు. అమడగూరు మండలంలో నల్లగుట్టపల్లి కంకరతేలిపోయిన రహదాని పూర్తి చేయలేకపోయారు. మండల కేంద్రాల నుంచి గ్రామాలకు రోడ్డు సౌకర్యం సరిగాలేక ప్రజలు ఇబ్బందుల పడుతున్నారు. జిల్లా కేంద్రంలో మున్సిపల్ కార్యాలయానికి స్థల సేకరణ చేస్తూనే ఉన్నారు. జిల్లా కేంద్రం ఏర్పడి రెండు సంవత్సరాలు గడిచినా ప్రభుత్వ కార్యాలయాలకు స్థల సేకరణలేదు. అద్దె భవనాల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగుతున్నాయి.

పుట్టపర్తి ఎమ్మెల్యేలు

2009లో టీడీపీ అభ్యర్థి పల్లె రఘునాథరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి కడపల మోహన్‌రెడ్డిపై 1021ఓట్లతో గెలుపొందారు. 2014 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పల్లె రఘునాథరెడ్డి వైసీపీ అభ్యర్థి కొత్తకోట సోమశేఖర్‌రెడ్డిపై 6,964 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి టీడీపీ అభ్యర్థి పల్లె రఘునాథరెడ్డిపై 31,255 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.



వందల ఏళ్లనాటి ఆలయం..

అమడగూరులో వెలసిన చౌడేశ్వరి అమ్మవారి ఆలయానికి వందల ఏళ్ల చరిత్ర ఉన్నట్లు పూర్వీకులు పేర్కొంటున్నారు. పూర్వం వడిరాజులు వక్కల వ్యాపారం కోసం వచ్చేవారు. అప్పట్లో తమ కుమార్తె మూడేళ్లపాపను అమడగూరు అమ్మగుడిలో వదిలి వెళ్లేవారు. తిరగి వచ్చిన తర్వాత చిన్నారి కనిపించకపోతే పాప కోసం వెతికి అలసిపోగా అమడగూరు అమ్మ మీపాప నాలో ఐక్యమైందని చౌడేశ్వరిగా పూజలు అందుకుంటుందని ప్రతి యేడు పూజలు చేయాలని అమ్మవారు తెలిపినట్లు పూర్వీకులు పేర్కొంటున్నారు.



యూనివర్సిటీ భవనం

సత్యసాయి విద్యాలయం

విలువలతోకూడిన విద్యను అందించడానికి సత్యసాయి నాలుగుదశాబ్దాల క్రితం శ్రీసత్యసాయి యూనివర్సిటీని ఏర్పాటు చేశారు. యూనివర్సిటీ పరిధిలో అనంతపురం మహిళా కళాశాల, ప్రశాంతినిలయం క్యాంపస్, కర్ణాటకలోని ముద్దనహళ్లి, బెంగుళూరులోని బృందావన్ క్యాంపస్‌ల ద్వారా కొన్ని లక్షల మందికి విద్యనందించి దేశంలోనే గుర్తింపు పొందిన విద్యాసంస్థగా పేరు గాంచింది.



ఓటు వేయకుంటే నేరమే !



మన దేశంలో ఓటు వేసినా, వేయకున్నా పట్టించుకునేవారు ఎవరూ లేరు. కానీ కొన్ని దేశాల్లో ఓటు వేయకపోవడాన్ని నేరంగా పరిగణిస్తారు. ఆస్ట్రేలియాలో ఓటు వేయకుంటే చిన్నపాటి నేరమే. అందుకు తగ్గ కారణం, అక్కడి ప్రభుత్వానికి చూపాల్సిందే. లేదంటే రూ.వెయ్యి జరిమానా చెల్లించాలి. లేదా నేరస్తుడిగా పరిగణిస్తారు. అర్జెంటీనాలో ఓటు వేయనివారికి సంవత్సర కాలం ప్రభుత్వ పథకాలు తొలగిస్తారు. పెరూ దేశంలో ఓటు వేయనివారికి పెద్ద శిక్ష అమలు చేస్తారు. వారి డ్రైవింగ్ లైసెన్సు రద్దు చేస్తారు. బెల్జియంలో ఓటు హక్కు వినియోగించుకోనివారిని కోర్టులో హాజరు పరుస్తారు. నాలుగు పర్యాయాలు ఓటు వేయనివారికి పదేళ్లపాటు ఓటు హక్కు రద్దు చేస్తారు. అకారణంగా ఓటు వేయనివారు ప్రభుత్వ ఉద్యోగ అర్హత కోల్పోతారు. బొలీవియాలో ఓటు వేయని ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇవ్వరు. బ్రెజిల్‌లో ఓటు వేయనివారికి జరిమానా విధిస్తారు. గ్రీస్, ఈజిప్ట దేశాల్లో ఓటు హక్కు వినియోగించుకోని వారిని కోర్టులో హాజరుపరుస్తారు. న్యాయస్థానంలో సరైన కారణం చూపనివారిని జైలుకు పంపుతారని ఆయా దేశాల్లో ఉన్న ఎన్ఆర్ఐలు చెబుతున్నారు.

- కదిరి అర్బన్

గుడిలో గూడు పుఠాణి !



యాడికి: రాయలచెరువులోని మాణిక్య రంగనాథస్వామి ఆలయంలో బుధవారం వైసీపీ నాయకులు రహస్య సమావేశం నిర్వహణకు పన్నాగం పన్నారు. ఇటీవల రాజీనామా చేసిన వలంటీర్లను, మరికొందరు వైసీపీ వారిని అక్కడకు రప్పించి సమావేశపరిచారు. సమావేశానికి స్థానిక వైసీపీనేతతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన మరో ఇద్దరు కీలక వైసీపీ నాయకులు వచ్చినట్లు సమాచారం. ఈ విషయం బయటకు రావడంతో మీడియా వారు వస్తారని సమావేశాన్ని వైసీపీ నాయకులు అర్థాంతరంగా నిలిపివేసి సమీపంలో ఉన్న ఒక ప్రైవేట్ పాఠశాలలో నిర్వహించారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో రాజీనామా చేసినా, గతంలో తమ పరిధిలోని ఓటర్లను కలవడం, వారు వైసీపీకి ఓట్లు వేసే విధంగా ప్రలోభపరచడంపై చర్చించినట్లు గుసగుసలాడుతున్నారు. ఓటర్లకు నగదు పంపిణీ బాధ్యతలను కూడా రాజీనామా చేసిన వలంటీర్లకు అప్పగించినట్లు సమాచారం. ఈ పని చేసినందుకుగాను వారికి తగిన పారితోషికం ఇస్తామని చెప్పినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు.

ముస్లింలను పట్టించుకోని వైసీపీ : బీకే



సమావేశంలో మాట్లాడుతున్న బీకే పార్థసారథి

ధర్మవరం, మే 1: వైసీపీ అధికారంలోకి వచ్చాక ముస్లిం మైనారిటీలను పట్టించుకోలేదని హిందూపురం పార్లమెంట్ కూటమి అభ్యర్థి బీకే పార్థసారథి పేర్కొన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశం జరిగింది. ఇందుకు కేంద్ర మాజీ మంత్రి సయ్యద్‌షానవాజ్ హుస్సేన్, బీకేపార్థసారథి, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిసత్యకుమార్‌యాదవ్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బీకే మాట్లాడుతూ... రాష్ట్రంలో మైనార్టీలకు అండగా నిలబడింది ఒక్క తెలుగుదేశం పార్టీనేనన్నారు. మైనార్టీలకు రంజాన్‌తోఫా, దుల్హాన్‌తో పాటు 13 పథకాలను చంద్రబాబు అందించారని గుర్తు చేశారు. ఇమాంలు, మౌజమ్‌లకు గౌరవవేతనం అందించారన్నారు. వైసీపీ వచ్చాక ఆ పథకాలన్నింటినీ రద్దు చేశారని తెలిపారు. అంతేకాకుండా సీఎం జగన్ ముస్లింల సంక్షేమాన్ని గాలికొదిలేశారని దుయ్యబట్టారు. ఎన్నికల్లో వైసీపీకి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. ధర్మవరంలో కేతిరెడ్డి ఆగడాలకు అంతులేకుండా పోయిందన్నారు. దౌర్జన్యాలు,భూ కబ్జాలు, దాడులు అధికమయ్యాయన్నారు. వీటికి చెక్‌పెట్టడానికి సత్యకుమార్‌ను కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అలాగే సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను ఎంపీగా గెలిపించాలని అభ్యర్థించారు. కూటమి శ్రేణులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశానికి హాజరైన మైనార్టీ మహిళలు

సూపర్ సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం

పుట్టపర్తి, మే 1: జిల్లాకేంద్రంలో కూటమి నాయకులు బుధవారం సూపర్ సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి పథకాల ప్రయోజనాల గురించి ప్రజలకు వివరించారు. చంద్రబాబు సీఎం అవగానే వాటిని అమలు చేస్తారని చెప్పారు. కనుక కూటమి విజయానికి కృషి చేయాలని కోరారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా పల్లె సింధూరారెడ్డిని, ఎంపీగా బీకే పార్థసారథిని గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జెస్తచలపతి, పీసీగంగన్న, మహమ్మద్‌రఫీ, రామలక్ష్మణులు, కడియాల సుధాకర్, కడియాలరాము, షామీర్, బీమినేని కిష్టప్ప, బీవీప్రసాద్, నారాయణస్వామి, ముకుంద, కోణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నంబులపూలకుంట: మండలకేంద్రంతోపాటు పి.కొత్తపల్లి గ్రామంలో కూటమి పార్టీల శ్రేణులు సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి పథకాల గురించి వివరించారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా కందికుంట వెంకటప్రసాద్‌ను, ఎంపీగా బీకే పార్థసారథిని గెలిపించాలని కోరారు.

గాండ్లపెంట: గాండ్లపెంట పంచాయతీ వద్దిరెడ్డిపల్లి, కోట్లపల్లి, నాయనవారిపల్లి, పోతవాండ్లపల్లిలో టీడీపీ మండల కన్వీనర్ కొండయ్య ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం చేశారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా కందికుంట వెంకటప్రసాద్‌ను, ఎంపీగా బీకే పార్థసారథిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సింగల్‌విండో మాజీ అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, మాజీ ఎంపీపీ గంగరాజు, మాజీ సర్పంచ్ కాకార్ల రవీంద్రారెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నల్లచెరువు: మండలకేంద్రంలో టీడీపీ శ్రేణులు సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం చేశారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. మండల కన్వీనర్ రాజశేఖర్, నాయకులు దాద్దెం శివారెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి: మండలకేంద్రంతో పాటు నల్లబోయనపల్లి గ్రామంలో కూటమి శ్రేణులు సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. అలాగే కమలం గుర్తుకు ఓటేసి సత్యకుమార్‌ను ఎమ్మెల్యేగా, సైకిల్ గుర్తుకు ఓటేసి బీకేఈ పార్థసారథిని ఎంపీగా గెలిపించాలని ప్రజల్ని కోరారు.

ముదిగుబ్బ: మండలకేంద్రంలోని 4, 5, 8, 9, 10, 13వ వార్డులలో కూటమి నాయకులు సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మండల క్లస్టర్ ఇన్‌చార్జి తుమ్మల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు: మండలకేంద్రంలో టీడీపీ నాయకులు సూపర్‌సిక్స్‌పై ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా పల్లె సింధూరారెడ్డిని, ఎంపీగా పార్థసారథిని గెలిపించాలని కోరారు. నాయకులు మండోజీ ఆర్‌ఫ్ ఖాన్, చికెన్‌షాను, జ్యోతి, మస్తానమ్మ, అఖిల తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి 50కుటుంబాల చేరిక



టీడీపీలోకి చేరిన వారితో పరిటాల శ్రీరామ్

ధర్మవరం రూరల్, మే1: మండలంలోని గొట్లూరు గ్రామానికి చెందిన 50 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. ధర్మవరం పట్టణంలోని పరిటాల క్యాంపు కార్యాలయంలో వారు పరిటాల శ్రీరామ్ సమక్షంలో చేరారు. వారికి శ్రీరామ్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు గొట్లూరుశ్రీనివాసులు, అనిల్‌గౌడ్, నారాయణస్వామి, అమరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

గాండ్లపెంట, మే 1: మండలంలోని వేపరాల పంచాయతీ సీఎం తండాలో మద్యం విక్రయిస్తున్న లోకేష్ నాయక్ నుంచి బుధవారం 20 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కృష్ణవేణి తెలిపారు. అందిన సమాచారం మేరకు సీఎం తండాలోని లోకేష్‌నాయక్ ఇంటిలో దాడులు చేశామన్నారు. 20 మద్యం బాటిళ్లు లభించగా.. స్వాధీనం చేసుకున్నారు. అనంతరం లోకేష్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రూ.1,40,150 నగదు స్వాధీనం

ధర్మవరం, మే 1: ఎటువంటి బిల్లులు లేకుండా నగదును తీసుకెళ్తున్న వ్యక్తి నుంచి రూ.1.40,150లను స్వాధీనం చేసుకున్నట్టు వన్‌టౌన్ సీఐ సుబ్రమణ్యం తెలిపారు. పట్టణంలోని ఎర్రగుంట్ల సర్కిల్‌లో బుధవారం తనతో పాటు ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది కలిసి వాహనాలు తనిఖీ చేపట్టామన్నారు. అందులో అనంతపురంజిల్లా పెద్దపప్పూరు మండలం కుమ్మర గ్రామానికి చెందిన గుంతలపుల్లయ్య, అదే మండలం నరసాపురంగ్రామానికి చెందిన శింగనమల రమేశ్ రూ.1,40,150 నగదును తీసుకెళ్తూ పట్టుపడ్డారన్నారు. ఎన్నికల నిబంధనలప్రకారం ఇంత డబ్బులు తీసుకెళ్లరాదని తెలియజేసి ఆ నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. నిర్దేశించిన విలువకు మించి డబ్బులు రవాణా చేయరాదని సీఐ తెలిపారు.

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టీడీపీలోకి చేరిక

ధర్మవరం రూరల్, మే1: మండలంలోని తుంపర్తి గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పరమేష్ బుధవారం టీడీపీలోకి చేరారు. విజయవాడలోని మాజీ మంత్రి, టీడీపీ జాతీయప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శ్యాముల్‌జవహర్ సమక్షంలో పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా తుంపర్తి పరమేష్ మాట్లాడుతూ చంద్రబాబుతోనే మాదిగలకు న్యాయం జరుగుతుందని భావించి టీడీపీలోకి చేరానన్నారు. పార్టీ విజయం కోసం కృషి చేస్తానని తెలిపారు.



టీడీపీలోకి తుంపర్తి పరమేష్‌ను ఆహ్వానిస్తున్న మాజీమంత్రి జవహర్

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి: కందికుంట

తనకల్లు, మే1: కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని చిన్నరామన్నగారిపల్లి, ఈతోడు పంచాయతీలోని గోపిరెడ్డిపల్లి, కొట్టువారిపల్లి, తొట్లివారిపల్లి, తొట్లివారిపల్లి దళితవాడ, తురకవాండ్లపల్లి, బిళ్లూరువాండ్లపల్లి, ఉప్ప వాండ్లపల్లి, రాకుంటపల్లి, చిన్నచెరువుపల్లి, ఈతోడు, టీ సదుం గ్రామాల్లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. గ్రామాల్లో మహిళలు హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. ఆయన ఇంటింటికి తిరిగి కూటమి సైకిల్ గుర్తుకు ఓటేసి తనను ఎమ్మెల్యేగా, బీకే పార్థసారధిని ఎంపీగా గెలిపించాలని అభ్యర్థించారు. సూపర్ సిక్స్ పథకాల వల్ల ప్రతికుటుంబానికి లబ్ధి చేకూరుతుందన్నారు. యువతకు ఉద్యోగం రావాలన్నా, మహిళలకు సంక్షేమ పథకాలు అందాలన్నా చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. ఈతోడు గ్రామంలో కార్మిక సంఘాల నాయకులు చేపట్టిన మేడే వేడుకల్లో కందికుంట పాల్గొని కేక్ కట్ చేశారు. అలాగే వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రెడ్డిశేఖర్‌రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ ఈశ్వర్‌రెడ్డి, నాయకులు రాజారెడ్డి, శంకర్‌నాయుడు, బాగేపల్లి చలపతి, దినకర్‌ప్రసాద్‌నాయుడు, శ్రీరాములనాయక్, హరినాయక్, తోట సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

● తనకల్లు మండలంలోని బొంతలపల్లికి చెందిన 15కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. కదిరి పట్టణంలోని కందికుంట నివాసంలో వారు ఆయన సమక్షంలో చేరారు. వారికి కందికుంట కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరినవారిలో శశికుమార్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటమల్లిరెడ్డి, లక్ష్మీనారాయణ, కుమార్, వెంకటేష్, చింతల మహేష్, మారెప్ప, క్రిష్ణారెడ్డి, శ్రీనివాసులు, తులసీ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ హిందూపురం పార్లమెంటు ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రవీంద్రారెడ్డి, నాయకులు నరసింహులు, నీలకంఠారెడ్డి, శంకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, జెరిపిటి రవి, నారప్పరెడ్డి, తాజుఖాన్, మౌలా, రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కొట్టువారిపల్లిలో ప్రచారం చేస్తున్న కందికుంట వెంకటప్రసాద్



ఈతోడులో పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న మహిళలు



ఈతోడు గ్రామంలో మేడే కేక్ కట్ చేసిన కందికుంట



టీడీపీలో చేరినవారితో కందికుంట

కూటమితోనే వడ్డెర్ల సంక్షేమం: మాజీ మంత్రి పల్లె

ఓబుళదేవరచెరువు, మే 1: కూటమి ప్రభుత్వంతోనే వడ్డెర్ల సంక్షేమం సాధ్యమని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలోని స్టేట్‌బ్యాంక్ మైదానంలో బుధవారం నియోజకవర్గంలోని వడ్డెర్లతో ఆత్మీయ సమావేశం జరిగింది. ఇందులో పల్లె పాల్గొని మాట్లాడారు. కూటమి మేనిఫెస్టో వడ్డెర్లకు ఎంతో మేలు చేసేలా ఉందన్నారు. వైసీపీ కపట నాటకాలు ఆడుతోందని, వడ్డెర్లు నమ్మరాదని అన్నారు. కూటమి అధికారంలోకి వస్తే బీసీలకు మరింత రాజకీయ ప్రాధాన్యం కల్పిస్తుందన్నారు. ఎన్నికల్లో జిల్లాలోని 7 అసెంబ్లీ స్థానాలతో పాటు హిందూపురం పార్లమెంట్ స్థానంలో కూటమి అభ్యర్థులను గెలిపించుకుందామని, చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. తర్వాత అందరూ చంద్రబాబు, మోదీ, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజనప్ప, వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లెల జయరాం, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు డీఎస్ మూర్తి, కన్వీనర్ జయచంద్ర, మాజీజడ్పీటీసీ పిట్టా ఓబుళరెడ్డి, బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి జెరిపిటి ఆంజనప్ప, పార్లమెంటు వడ్డెర సాధికార కమిటీ కార్యదర్శి పీట్ల సుధాకర్, పార్లమెంటు అధ్యక్షులు పల్లెపు రవీంద్ర, ఎంపీటీసీ శ్రీనివాసులు, జోనల్ కోఆర్డినేటర్ నరసింహులు కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

●ఓబుళదేవరచెరువు మండలకేంద్రంతోపాటు అమడగూరు మండలంలోని బావాజీ కొత్తపల్లికి చెందిన 30కుటుంబాల వారు టీడీపీలోకి చేరారు. ఓడీసీలోని టీడీపీ కార్యాలయాలంలో వారు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సమక్షంలో చేరారు. వారికి పల్లె కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.



వడ్డెర సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పల్లె

కూటమి అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ

నల్లమాడ: కూటమి అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీని విడుదల చేస్తారన యువనాయకుడు పల్లె వెంకట క్రిష్ణకిషోర్ పేర్కొన్నారు. మండలంలోని చౌటకుంటపల్లి, గంగాపురం, రామాపురం, బొగ్గపల్లి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటా తిరిగి సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా పల్లె సింధూరను, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని కోరారు. చౌటకుంటపల్లి కూడలిలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు సీఎం అయిన వెంటనే మెగా డీఎస్సీ విడుదల చేస్తారని పేర్కొన్నారు. అలాగే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తారన్నారు. ఈ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలు చేస్తాయని చెప్పారు. ఆయనకు గ్రామాల్లో విశేష ఆదరణ లభించింది. టీడీపీ మండల కన్వీనర్ మైలే శివశంకర్, నాయకులు చందన్‌బాబు, పద్మానాభరెడ్డి, నిజాంవలి, నాగభూషణరెడ్డి, నాగరాజు, అబ్దుల్‌సాబ్, సలీం బాషా, గంగులప్ప, ప్రభాకర్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● నల్లమాడ మండలం చౌటకుంటపల్లిలో 15కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. ప్రచారంలో ఉన్న పల్లె వెంకటక్రిష్ణకిషోర్‌రెడ్డిని వారు కలిసి ఆయన సమక్షంలో చేరారు. వారికి కిశోర్‌రెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. బొగ్గపల్లి, రామాపురం గ్రామాలకు చెందిన పలువురు కూడా టీడీపీలోకి చేరారు.



టీడీపీలోకి చేరిన వారితో పల్లె వెంకట క్రిష్ణ కిశోర్‌రెడ్డి

రజకులతో ప్రత్యేక సమావేశం..

బుక్కపట్నం: మండల కేంద్రంలో మాజీమంత్రి పల్లె రఘునాథ రెడ్డి రజకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో రజకులు అన్నివిధాలుగా అభివృద్ధి సాధించారన్నారు. తాను మంత్రిగా ఉన్నపుడు నియోజకవర్గంలో రజకులకు ప్రత్యేక దోబీఘాట్లు ఏర్పాటుచేసి, బోర్లు వేయించి ఆదుకున్నానన్నారు. వైసీపీ పాలనలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి రజకులకోసం ఏ ఒక్కటి చేయలేదని విమర్శించారు. ఈ ఎన్నికల్లో కూటమిని గెలిపిస్తే రజకుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సుబ్బారెడ్డి, చెన్నక్రిష్ణ, జంగం వెంకటరాముడు, బాలు, గోర్ల క్రిష్ణ, మీసాల మురళి, తెలుగుయువత రాజేశఖర్‌గౌడ్, సతీష్‌రాయల్, జనసేన నాయకులు అల్లాడి జయరాం పాల్గొన్నారు.

సమస్యలన్నీ పరిష్కరిస్తా: సత్యకుమార్



నేలకోటలో సత్యకుమార్‌యాదవ్‌ను గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

ధర్మవరం రూరల్, మే1: తనను ఆదరించి గెలిపిస్తే నిత్యం అందుబాటులో ఉండి గ్రామాల్లో సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని కూటమి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్ ప్రజలకు భరోసా కల్పించారు. మండలంలోని ఓబుళనాయునిపల్లి, దర్శినమల, నడిమిగడ్డపల్లి, తండా, బిల్వంపల్లి, నేలకోట, నేలకోటతండా, బుడ్డారెడ్డిపల్లి, ఏలుకుంట్ల, తనకంటివారిపల్లి గ్రామాల్లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఆయన ఇంటింటా తిరిగి కమలం గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, సైకిల్ గుర్తుకు ఓటు వేసి బీకే పార్థసారధిని ఎంపీగా గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారన్నారు. ఇక్కడ తనను ఆదరించి గెలిపిస్తే నిత్యం ఇక్కడే ఉండి అందరికీ అందుబాటులో ఉంటానని, సమస్యలన్నీ పరిష్కరిస్తానని, నియోజకవర్గ అభివృద్ధికి పాటు పడతానని హామీ ఇచ్చారు. ప్రజలు ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ చిగిచెర్ల ఓబిరెడ్డి, మాజీ ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు మద్దిలేటి, మహేష్‌చౌదరి, కన్వీనర్ పోతుకుంటలక్ష్మన్న, మాజీ జడ్పీటీసీ మేకలరామాంజినేయులు, ముత్యాలప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సత్యకుమార్‌ను గెలిపించండి

బత్తలపల్లి: సత్యకుమార్‌కు మద్దతుగా కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే మునిరత్నంనాయుడు ఎన్నికల ప్రచారం చేపట్టారు. మండలకేంద్రమైన బత్తలపల్లిలో గల గూండా కల్యాణ మండపంలో బుధవారం ఆయన టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఏపీని జగన్ అప్పుల రాష్ట్రంగా మార్చి నాశనం చేశారని మండిపడ్డారు. ప్రస్తుతం ఈ రాష్ట్రానికి చంద్రబాబు సేవలు అవసరమన్నారు. కూటమి అభ్యర్థులను గెలిపించి చంద్రబాబును సీఎం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ధర్మవరంలో సత్యకుమార్‌ను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తారని తెలిపారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

దళితుల సంక్షేమాన్ని అడ్డుకున్న సీఎం జగన్

ధర్మవరంరూరల్: దళితుల సంక్షేమానికి కేంద్రప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తే వాటిని సీఎం జగన్ దారిమళ్లించారని బీజేపీ ఎస్సీమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్ పేర్కొన్నారు. మండలంలోని చిగిచెర్ల గ్రామంలో ఎస్సీకాలనీవాసులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేంద్రంలో నరేంద్రమోదీ సారథ్యంలో మన రాష్ట్రానికి దళితవాడల అభివృద్ధికి నిధులు కేటాయిస్తే వాటిని సీఎం జగన్ దారి మళ్లించి దళితుల సంక్షేమాన్ని అడ్డుకున్నారని ఆరోపించారు. దళితుల సంక్షేమానికి బీజేపీ కృషి చేస్తోందన్నారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా సత్యకుమార్‌యాదవ్‌ను గెలిపించాలని కోరారు. కమలం గురు వేటు వేయాలన్నారు. అలాగే సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎంపీగా బీకే పార్థసారథికి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మేకలరామాంజినేయులు, టీడీపీ నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షులు నారాయణస్వామి, నాయకులు, ఎస్సీకాలనీవాసులు పాల్గొన్నారు.

పించన్.. టెన్షన్..

● బ్యాంకు ఖాతాల్లో జమచేస్తే ఇబ్బందులే

● ఆందోళన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

ధర్మవరంరూరల్, మే1: మండలవ్యాప్తంగా పింఛన్‌దారులకు కష్టాలు తప్పలేదు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో గతనెల ఏప్రిల్‌లో సచివాలయ సిబ్బందిచే పింఛన్లు పంపిణీ చేశారు. మే నెల మాత్రం బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు ప్రకటించారు. దీంతో పింఛన్‌దారుల్లో ఆందోళన నెలకొంది. బ్యాంకు ఖాతాల్లో పింఛన్‌డబ్బులు జమచేస్తే తీవ్రమైన ఎండలకు ఎలా అబ్బా పోయేది అంటూ పింఛన్‌దారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకులో జమచేస్తే ఎలా తెచ్చుకునేది అంటూ వృద్ధులు ఆవేదన చెందుతున్నారు. గతనెల మాదిరిగా ఈ నెల కూడా సచివాలయ సిబ్బందితో పంపిణీ చేసింటే బాగుండేది అంటూ పలువురు పేర్కొంటున్నారు. బుధవారం నడిమిగడ్డపల్లి తండాలో పింఛన్‌దారులకు పింఛన్ పంపిణీ చేస్తారని అంతా ఒకచోటికి చేరుకున్నారు. అయితే వారికి సచివాలయ సిబ్బంది మీ అందరికి బ్యాంకులో పింఛన్‌డబ్బులు జమచేస్తారు అని తెలపడంతో వారంతా ఆందోళనకు గురయ్యారు. సచివాలయ సిబ్బందితో గత నెల మాదిరిగా పంపిణీ చేసింటే బాగుండు అని ఒకరినొకరు చర్చించుకున్నారు. తమ ఊరిలో బ్యాంకు లేదని పక్కఊరు దర్శినమల గ్రామంలో ఉందని, అక్కడికి వెళ్లాలంటే 2కిలోమీటర్లు దూరం వెళ్లాలని దీంతో ఇబ్బందులు తప్పవని పింఛన్‌దారులు మండిపడ్డారు. ఇళ్లవద్దనే ప్రభుత్వం సచివాలయ ఉద్యోగుల ద్వారా పంపిణీ చేయాలని వారు కోరుతున్నారు.



నడిమిగడ్డపల్లి తండాలో దీనంగా కూర్చున్న పింఛన్‌దారులు

పింఛన్ల పంపిణీలో వలంటీర్

నల్లచెరువు, మే 1: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా పట్టించుకోకుండా బుధవారం పింఛన్ల పంపిణీ చేస్తున్న సచివాలయ ఉద్యోగివెంట వలంటీర్ ఉండడం గమనార్హం. నల్లచెరువు సచివాలయం -2 వలంటీర్ ఆంజనేయులు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. బ్యాంకు ఖాతాలున్న వారికి ప్రభుత్వం పింఛన్ సొమ్మును ఖాతాల్లో జమ చేసింది. ఖాతాలు లేనివారికి సచివాలయ సిబ్బంది పంపిణీ చేస్తారని, పంచాయతీ రాజ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శశిభూషన్ కుమార్ పేర్కొన్నారు. అయితే మండలకేంద్రంలోని బసవన్నకట్టవద్ద వికలాంగ పింఛన్ల పంపిణీ చేయాడానికి వెళ్లిన సచివాలయ ఉద్యోగి వెంట వలంటీర్ ఉన్నారు. ఆ వలంటీర్‌పై చర్యలు తీసుకోవాలని కూటమి నాయకులు కోరుతున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కదిరిఅర్బన్, మే 1: పట్టణంలోని గిరిజన గురుకుల సంక్షేమ బాలికల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మురళీశ్రీనివాస్ బుధవారం ప్రకటనలో తెలిపారు. 3వతరగతిలో 40సీట్లు ఉండగా ఎస్టీలకు 32, ఎస్సీల 5, బీసీలకు 2, ఓసీలకు 1 కేటాయించినట్లు తెలిపారు. నాలుగో తరగతిలో 28సీట్లు, ఐదులో 7, తొమ్మిదిలో 2 సీట్లు ఉన్నాయన్నారు. అవి కేవలం ఎస్టీ విద్యార్థులకు మాత్రమే ఉన్నాయన్నారు. విద్యార్థినులు దరఖాస్తులను ఈనెల 20లోపు పాఠశాలలో అందించాలన్నారు. సీట్లు కేటాయింపు లాటరీ పద్ధతితో నిర్వహిస్తారన్నారు. వివరాలకు 9441059189కు సంప్రదించాలన్నారు.

మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

తనకల్లు, మే 1: మండలంలోని ఈతోడు గ్రామంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాగా గ్రామస్థులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయన ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోలో అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే సంక్షేమపథకాలున్నాయన్నారు. ఇందుకు గాను పాలాభిషేకం చేసినట్లు పలువురు చెప్పారు.



చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

జనసేనలోకి కాంగ్రెస్ నాయకుల చేరిక



సమక్షంలో జనసేనలోకి చేరిన వారితో చిలకం మధు

ధర్మవరం, మే 1: పట్టణంలోని 28వ వార్డుకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు జనసేనలోకి చేరారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. చిలకం మధు వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో మంజులశ్రీనివాసులు,వెంకట్, వెంకటేశ్, కుమార్,పురుషోత్తం, మంజుల బాలాజీ, సాయి, రాజేశ్, గణేశ్,బాబావలీ, కల్యాణ్ తదితరులు ఉన్నారు. పవన్‌కల్యాణ్ సిద్ధాంతాలు నచ్చి జనసేనలోకి చేరినట్లు వారు తెలిపారు.

ఘనంగా కార్మిక దినోత్సవం

● వాడవాడలా రెపరెపలాడిన కార్మిక జెండా

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్ వర్క్: ప్రపంచ కార్మికుల దినోత్సవ (మేడే) వేడుకలను పుట్టపర్తి, కదిరి, ధర్మవరం నియోజకవర్గాల వ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. నియోజవర్గ కేంద్రాలతో పాటు మండలకేంద్రాలు, గ్రామాల్లో సైతం సీపీఎం, సీపీఐ, సీఐటీయూ నాయకులు, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు ఘనంగా జరిపారు. ఈ సందర్భగా ప్రధాన కూడళ్లలో జెండాలను ఆవిష్కరించారు. అలాగే కేక్‌లు కట్ చేశారు. వక్తలు మాట్లాడుతూ కార్మికదినోత్సవ విశిష్టతను వివరించారు. కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. పలుచోట్ల కార్మికసంఘాల నాయకులు, కార్మికులు ర్యాలీలు చేపట్టారు. పలు ప్రాంతాల్లో పలు రాజకీయ పార్టీల నాయకులు, ఎమ్మెల్యే అభ్యర్థులు సైతం మేడే వేడుకల్లో పాల్గొని కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు.



ధర్మవరంలో కార్మిక జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు



కదిరిలోని నిజాంవలీ కాలనీలో ..



తనకల్లులో ..



ముదిగుబ్బలో ..



ఓడీసీలో..

నేడు అయ్యప్పస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ

కదిరి అర్బన్, మే 1: పట్టణంలోని శివాలయం వద్ద ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవం గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ జీ. శంకరయ్య బుధవారం తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా గురువారం ఉదయం 6గంటలకు గణపతి హోమం, 7 గంటలకు ఉషా పూజ, 8గంటలకు కలిశ పూజ, 10:30కు కలిశాభిషేకం, మధ్యాహ్నం 12 గంటలకు ఉత్సవపూజ, మహామంగళహారతి నిర్వహిస్తామన్నారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు దళితుల ఆత్మీయ సమావేశం

టీడీపీ నాయకులు

మడకశిరటౌన్, మే 1: తెలుగుదేశం పార్టీ దళితుల ఆత్మీయ సమావేశాన్ని గురువారం మడకశిర పట్టణంలోని యాదవ కల్యాణమండపంలో ఏర్పాటు చేసినట్లు టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆర్ మంజునాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు జరిగే ఈసమావేశానికి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.ఎస్.రాజు, నియోజకవర్గం సమన్వయ కర్త గుండుమల తిప్పేస్వామి హాజరవుతారని తెలిపారు.

రొళ్ల : తెలుగుదేశం పార్టీ మడకశిర నియోజకవర్గం సమన్వయకర్త గుండుమల తిప్పేస్వామి, ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు ఆధ్వర్యంలో గురువారం 10 గంటలకు దళితుల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు టీడీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మూర్తి, మడకశిర ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి మంగళవారం తెలిపారు. మడకశిరలోని యాదవ కల్యాణమండపంలో నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

బెదిరింపులకు పాల్పడుతున్నారు...

రక్షణ కల్పించండి

ఆర్వోకు స్వతంత్ర అభ్యర్థి ఫిర్యాదు

పెనుకొండ, మే 1 : స్వతంత్ర అభ్యర్థిగా పెనుకొండ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న తననుకొందరు గుర్తుతెలియని వ్యక్తులు... ప్రచారం చేయకూడదంటూ బెదిరిస్తున్నారని రిటర్నింగ్ అధికారి అపూర్వ భరత్‌కు ఫిర్యాదు చేసినట్లు అభ్యర్థి హబీబ్ తెలిపారు. తాను బుధవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి రిటర్నింగ్ అధికారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేశానన్నారు. తనకు రక్షణ కల్పించాలని కోరినట్లు ఆయన ఫోన్ ద్వారా తెలిపారు. స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసినప్పుడు కొందరు వ్యక్తులు నామినేషన్ ఉపసంహరించుకోవాలని, ఫేస్‌బుక్, వాట్సప్‌ల ద్వారా బెదిరించారన్నారు. వాటిని తాను లెక్కచేయలేదన్నారు. దీంతో రెండురోజుల కిందట ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ముసుగులు ధరించి చెరువు రోడ్డులోని గగన్మహల్‌వద్ద చీకటిలో తనను బెదిరించారన్నారు. ఎన్నికల బరిలో ఉండకూడదని చెప్పినా ఎందుకున్నావని ఎక్కడైనా ప్రచారం చేస్తే నీ అంతు చూస్తామంటూ బెదిరించి వెళ్లిపోయినట్లు తెలిపారు. ఈ విషయంపై తాను ఆర్‌ఓకు ఫిర్యాదు చేశానన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, మే 1: మండలంలోని ముత్తరాయణ తండాకు చెందిన సోమ్లానాయక్ కుటుంబ కలహాలతో విష ద్రావకం తాగి బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పేలూనాయక్ కుమారుడైన సోమ్లానాయక్ భార్యతో గొడవపడి మనస్తాపానికి గురైనట్లు బంధువులు తెలిపారు. ఆవేశంతో విషద్రావకం తాగి అస్వస్థతకు గురైన అతడిని వెంటనే గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించగా, వైద్యులు చికిత్సలు చేసినట్లు తెలిపారు. అనంతరం మెరుగైన వైద్యంకోసం 108 వాహనంలో హిందూపురం తరలించినట్లు తెలిపారు.

ఎద్దులబండిని ఢీకొన్న కంటెయినర్

ఎద్దు మృతి, వ్యక్తికి గాయాలు



ఎద్దులబండిని ఢీకొట్టిన కంటెయినర్

పెనుకొండ టౌన్(సోమందేపల్లి), మే1 : జీవనోపాధి కోసం ఓ వ్యక్తి బుధవారం ఎద్దులబండిలో ఇసుక తరలిస్తుండగా వెనుక నుంచి కంటెయినర్ లారీ ఢీకొనడంతో ఎద్దు మృతిచెందింది. అతడు గాయాల పాలయ్యాడు. సోమందేపల్లికి చెందిన సుబ్బరాయుడు అనే వ్యక్తి అదే మండలంలో వెలగమాకుల పల్లి సమీపంలోని వంక నుంచి ఎద్దులబండిలో ఇసుక తరలిస్తున్నాడు. అతడు 44వ జాతీయ రహదారి మీదుగా సోమందేపల్లికి వస్తుండగా మార్గమధ్యలో పాపిరెడ్డిపల్లి వద్ద తెల్లవారుజామున 6గంటల సమయంలో ఓ కంటెయినర్ లారీ ఎద్దులబండిని వెనుక నుంచి ఢీకొంది. పక్కనే ఉన్న హైటెన్షన్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ ఎద్దు మృతిచెందగా, అతడు గాయాల పాలయ్యాడు. గాయడిన సుబ్బరాయుడు సోమందేపల్లి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తనిఖీల్లో...

రూ.1,40,150 నగదు స్వాధీనం

ధర్మవరం, మే 1: ఎటువంటి బిల్లులు లేకుండా నగదును తీసుకెళ్తున్న వ్యక్తి నుంచి రూ.1.40,150లను స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. పట్టణంలోని ఎర్రగుంట్ల సర్కిల్‌లో బుధవారం తనతోపాటు ఎస్‌ఐ శ్రీనివాస్, సిబ్బంది కలిసి వాహనాలు తనిఖీ చేపట్టామన్నారు. అందులో అనంతపురంజిల్లా పెద్దపప్పూరు మండలం కుమ్మర గ్రామానికి చెందిన గుంతలపుల్లయ్య, అదే మండలం నరసాపురంగ్రామానికి చెందిన సింగనమలరమేశ్ రూ.1,40,150 నగదును తీసుకెళ్తూ పట్టుపడ్డారన్నారు. ఎన్నికల నిబంధనలప్రకారం ఇంత డబ్బులు తీసుకెళ్లరాదని తెలియజేసి ఆ నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. నిర్దేశించిన విలువకు మించి డబ్బులు రవాణా చేయరాదని సీఐ తెలిపారు.

ఫ్యాన్‌కు ఓటేస్తే ఉరేసుకోవాల్సిందే..

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత


సానిపల్లి రోడ్‌షోలో పాల్గొన్న సవిత

రొద్దం, మే 1 : ఒక్క చాన్స్‌పేరుతో అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ ప్రభుత్వం అవినీతి, అరాచకాలకు ఒడిగట్టిందని... మళ్లీ వైసీపీకి ఓటేస్తే జనం ఫ్యాన్‌కు ఉరివేసుకోవాల్సిందేనని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పేర్కొన్నారు. ఆమె బుధవారం రొద్దం మండల పరిధిలోని సానిపల్లి, గొబ్బరంపల్లి, బొమ్మిరెడ్డిపల్లి, నల్లూరు, చోళేమర్రి, కల్లుకుంట, చిన్నమంతూరు, దందేపల్లి, పీ కొత్తపల్లి, పెద్దమంతూరు, చెరుకూరు గ్రామాల్లో రోడ్‌షో నిర్వహించారు. ఈ ఐదేళ్లకాలంలో వైసీపీ ప్రభుత్వం అనేకమంది టీడీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించిందన్నారు. ఇసుక, మద్యం, మట్టి, గనుల నుంచి వేల కోట్ల సంపదను వైసీపీ నాయకులు కొల్లగొట్టారన్నారు. గత టీడీపీ పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలే గ్రామాల్లో కనిపిస్తున్నాయన్నారు. భవిష్యత్తులో కియ అనుబంధ పరిశ్రమలు తీసుకొచ్చి మీ పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనకు పార్లమెంట్ అభ్యర్థి బీకే పార్థసారథికి ఓటు వేసి గెలిపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జీవీపీనాయుడు, మాధవనాయుడు, మాజీ జడ్పీటీసీ సుబ్బరత్నమ్మ, చంద్రమౌళి, నరహరి, హరీష్, శ్రీనాథ్‌చౌదరి, క్లస్టర్ ఇన్‌చార్జ్‌నాగేంద్ర, సానిపల్లి సూరీ, వెంకటేశ్, గొబ్బరంపల్లి రవి, చోళేమర్రి సర్పంచ్ జనార్దన్, ఎమ్మార్పీఎస్ నాగరాజు, చిన్నమంతూరు వెంకటేశ్, పవన్, నరసింహులు, టైలర్ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

యువతను ముంచిన సీఎం

పెనుకొండ టౌన్: యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించకపోవడమే కాకుండా, చాలామందిని గంజాయికి బానిసలు చేసిన వ్యక్తి సీఎం జగన్ అని టీడీపీ కూటమి ఎమ్మెల్యేఅభ్యర్థి సవిత ఆరోపించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ మ్యానిఫెస్టోపై మాట్లాడారు. అన్నివర్గాలకు న్యాయం చేసేలా చంద్రబాబు, కూటమి నేతలు మేనిఫెస్టోను రూపొందించారని అదే వైసీపీ మేనిఫెస్టో రైతులతో పాటు సామాన్యులను నట్టేట ముంచేలా ఉందన్నారు. అలాగే మేడేను పురస్కరించుకుని సవిత లారీ డ్రైవర్ అసోసియేషన్‌తో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న ఆ అసోసియేషన్ కార్యాలయం వద్ద బుధవారం జెండా ఆవిష్కరించారు. టీడీపీ ప్రభుత్వం కార్మికులకు అండగా ఉంటుందన్నారు.


కార్మికుల జెండా ఆవిష్కరిస్తున్న సవిత

టీడీపీలోకి పలువురి చేరిక

పెనుకొండ టౌన్/ రొద్దం: గోరంట్ల మండలం నుంచి వైసీపీకి చెందిన 52కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి సవిత బుధవారం పెనుకొండలోని టీడీపీ కార్యాలయంలో కండువావేసి ఆహ్వానించారు. గోరంట్ల పట్టణ నాయకుడు యువశేఖర్ ఆధ్వర్యంలో నాగిరెడ్డిపల్లి నారాయణ స్వామి, వరలక్ష్మి, రిజ్వాన్‌బాషా, నారాయణస్వామి, గోపాల్‌నాయక్, నాగేంద్ర, లక్ష్మీనారాయణ, అశోక్ కుమార్, మహాలక్ష్మి, మాధవి, పూజ, రమణమ్మ, నాగలక్ష్మి తదితరులు టీడీపీలో చేరారు. అలాగే రొద్దం మండలంలోని నల్లూరులో వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. గ్రామంలో రోడ్‌షో సందర్భంగా సవిత వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలోకి నారాయణప్ప, ఓబుళ నరసింహప్ప, ఆదినారాయణ , ఓబులేసు, అంజనప్ప, సుబ్బరాయప్ప, తలారి కిష్టప్ప, ఓబుళనరసింహప్ప, చంద్రప్ప, నంజుం డప్ప, సన్న ఓబయ్య, రమేష్, సిద్దప్ప, గంగాధరప్ప, జయనరసింహప్ప, శ్రీధర్, గోవిందప్ప తదితరులు చేరారు.

పెనుకొండ రూరల్: అరాచకాలు, దౌర్జన్యాలు, భూకబ్జాలు, సెటిల్‌మెంట్‌లలో సీఎం జగన్‌ను మించిన నేత వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్‌అని మాజీ జడ్పీటీసీ నారాయణస్వామి, మాజీ సర్పంచ్ సూర్యనారాయణ విమర్శించారు. టీడీపీ నాయకులు బుధవారం మండలంలోని గుట్టూరులో సవిత తరుపున ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు లక్ష్మీ నారాయణరెడ్డి భాస్కర్‌రెడ్డి, మల్లికార్జున, బాబుల్‌రెడ్డి, వాసుదేవ రెడ్డి, డీలర్ భాస్కర్‌రెడ్డి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రఘువీరచౌదరి, కోనాపురం రామలింగ తదితరులు పాల్గొన్నారు.


గుట్టూరు ప్రచారంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

రాక్షస పాలనకు చరమగీతం పాడుదాం

టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు


మేనిఫెస్టోను వివరిస్తున్న ఎంఎస్ రాజు, గుండుమల

మడకశిరటౌన్, మే 1: వైసీపీ రాక్షస పాలనకు చరమగీతం పాడుదామని, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకుని మంచి పాలన పొందుదామని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు పిలుపునిచ్చారు. ఆయన బుధవారం టీడీపీ నియోజకవర్గం సమన్వయ కర్త గుండుమల తిప్పేస్వామితో కలిసి పట్టణంలోని శివాపురం, మారుతీనగర్, చిల్లెచిక్కనబండ, నాగన్నకుంట, వడ్రపాళ్యం తదితర కాలనీల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే అవినీతి రహిత పాలన అందిస్తామన్నారు. ఆగిపోయిన ప్రతిపనిని పూర్తి చేస్తామని, మడకశిరను అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి చేసిన అవినీతిని ఎండగట్టారు. వైసీపీ ఎమ్మెల్యే తిప్పేస్వామి అవినీతికి భయపడి తెరుచుకోని గార్మెంట్స్ పరిశ్రమను టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే తెరిపించి యువతకు ఉపాధి కల్పిస్తామని భరోసా ఇచ్చారు. నగర పంచాయతీ పరిధిలో ఆగిపోయిన రెండు వేల ఇళ్లను తిరిగి నిర్మిస్తామని, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పిస్తామని తెలిపారు. ఇళ్ల వద్దకు వెళ్లి టీడీపీ మేనిఫెస్టోను వివరించారు. అవినీతి రహిత పాలనను అందించే చంద్రబాబును అందరూ ఆశీర్వదించాలని కోరారు. తెలుగుదేశం పార్టీ సైకిల్ గుర్తుకు ఓటువేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రతి కాలనీలలోను స్థానిక ప్రజలు పూలవర్షం కురిస్తూ బ్రహ్మరథం పట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, జిల్లాకార్య నిర్వాహక కార్యదర్శి రాధాకృష్ణ, టీడీపీ జిల్లా మైనారిటీ అధ్యక్షులు భక్తర్, నాయకులు మనో హర్, ఓబుళేశు, మాధవరాజు, ఉమాశంకర్, తిమ్మరాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ సుబ్బరాయడు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీ వలసలు

మడకశిర నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి భారీ స్థాయిలో చేరుతున్నారు. మడకశిరలోని బాలాజీనగర్‌లో ఉన్న టీడీపీ కార్యాలయంలో బుధవారం 30 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. నీలకంఠాపురం పంచాయతీ నుంచి 10కుటుంబాలు, హరేసముద్రం నుంచి ఏడు, గుడిబండ మండలం రాళ్లపల్లి నుంచి ఐదు గురితో పాటు మండలంలోని పలు గ్రామాల నుంచి టీడీపీలో చేరారు. అలాగే పట్టణంలోని 30 మైనార్టీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఎంఎస్ రాజు, గుండుమల తిప్పేస్వామి వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ నాయకులు భక్తర్, నాయకులు ఫయాజ్, నర్సేగౌడ్, వడ్డేరఘురాం, కరియన్న తదితరులు ఉన్నారు.


టీడీపీలోకి చేరుతున్న మైనారిటీల కుటుంబాలు

త్యాగాలు, పోరాటాల ఫలితమే కార్మికదినం

కార్మిక సంఘాల నాయకులు


హిందూపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

హిందూపురం అర్బన్, మే 1: ఎంతో మంది కార్మికుల త్యాగాల, పోరాట ఫలితమే కార్మిక దినం అని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జడ్పీ శ్రీనివాసులు పేర్కొనారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం, ప్రభుత్వ ఆసుపత్రి, ఆటో స్టాండ్, సివిల్ సప్లై గోడౌన్, తూమకుంట పారిశ్రామికవాడ తదితర చోట్ల బుధవారం మేడే సందర్భంగా ఎర్ర జెండా ఎగరవేశారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించి ఆర్‌అండ్‌బి బంగ్లా వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు పెద్దన్న, సీఐటీయూ జిల్లా కోశాధికారి సాంబశివ, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకుటు జగదీష్, మల్లీ, ఆనంద్, రమణ, రామకృష్ణ, బాబ, అంగన్‌వాడీ లావణ్య, శైలజ తదితరులు ఉన్నారు.

పెనుకొండ : కార్మిక దినోత్సవాన్ని బుధవారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పెనుకొండలోని సీఐటీయూ కార్యాలయం వద్ద నాయకులు బాబావలి, తిప్పన్న, గంగాధర్, మాబున్నిసా, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ చిన్న వెంకటేశ్వర్లు, ఆటోయూనియన్ నాయకులు నాగప్ప తదితరులు జెండా ఆవిష్కరించారు. స్థానిక ఏఐటీ యూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు ఆధ్వర్యంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్మిక అమరవీరు లకు నివాళులర్పించారు. ఈ కార్యక్ర మంలో నాయకులు మహేష్, గజేంద్ర, తిరు, నరసిం హులు, నాగరాజు, మణి, సురేష్, బావక్క, నరసమ్మ, శాంతమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

రొద్దం : మేడే సందర్భంగా బుధవారం రొద్దంలోని అంబేడ్కర్ సర్కిల్‌వద్ద సీఐటీయూ నాయకులు జెండా ను ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా నాయకుడు ర మేష్, రైతు సంఘం నాయకుడు ఫక్రుద్దీన్, అంగన్‌వాడీ కార్యకర్తలు, పారిశుద్య కార్మికులు పాల్గొన్నారు.

గోరంట్ల: మండల వ్యాప్తంగా కార్మిక దినోత్సవాన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఘ నంగా నిర్వహించారు. గోరంట్లలోని ఎమ్మార్పీ భవనం వద్ద ఏఐటీయూసీ నాయకులు, పవర్‌లూమ్స్ కార్మికులు జెండా ఆవిష్క రించారు. కార్మిక నాయకులు సుధాకర్, రా మక్రిష్ణ, సురేష్‌బాబు, మనోహర్, శంకర్, వెం కటేష్, శ్రీనివాసులు, బాబు, సుకన్య తదితర లున్నారు. పాలసముద్రం జాతీయ రహదారి కూడలిలోని సీపీఎం కాలనీలో కార్మిక దినోత్స వాన్ని నిర్వహించారు. కార్మిక నాయకులు కొండా వెంక టేష్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, నాగ భూషణం, ఆంజనాదేవి, స్వర్ణలత, ఆంజనే యులు, నం జుడప్ప, గంగరత్నమ్మ, శోభా, గంగులమ్మ, లక్ష్మీనరస మ్మ, వెంకటలక్ష్మమ్మ, అచ్చమ్మ తదితరులున్నారు.

లేపాక్షి : కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం లేపాక్షిలో మేడే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక బస్టాండు ఆవరణంలో సీఐటీయూ జెండా ఎగురవే శారు. ఆటోకార్మికులు, కూలీలు పాల్గొన్నారు.

మడకశిరటౌన్: పట్టణంలో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణంలో సీఐటీయు జెండా ఆవిష్కరించారు. అమరాపురం బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఇంతియాజ్, అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, ఆశా వర్కర్ల జిల్లా అధ్యక్షురాలు సౌభాగ్య, సీఐటీయూ నాయకులు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఈరేష్, కేవీపీఎస్ నాయకులు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


మడకశిరలో మానవహారంగా ఏర్పడిన కార్మికులు


రొద్దంలో మేడే ఉత్సవాల్లో సీఐటీయూ నాయకులు


పెనుకొండలో సీఐటీయూ ఆధ్వర్యంలో పతాకావిష్కరణ


ఏఐటీయూసీ ఆధ్వర్యంలో...


గోరంట్లలో జెండా ఎగురవేస్తున్న కార్మికులు

అన్నివర్గాలకు టీడీపీతోనే న్యాయం

ఇంటింటి ప్రచారంలో నాయకులు

హిందూపురం అర్బన్, మే 1: అన్ని వర్గాలకు న్యాయం జరిగేది టీడీపీతోనే అని టీడీపీ పరిగి మండలం సీనియర్ నాయకులు పేర్కొన్నారు. పరిగి మండల పరిధిలోని శీగిపల్లి, గణపతిపల్లిల్లో బుధవారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ ఆధ్వర్యంలో వారు విస్తృత ప్రచారం చేపట్టారు. ఇంటింటికి తిరిగి టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగాధరప్ప, నాయకులు రామాంజి. యల్లప్ప, అనంతప్ప, హరీష్, శంకర్ రెడ్డి, నంజుండప్ప, మారుతి తదితరులు ఉన్నారు.

అగళి : మండలంలోని ఇరిగేపల్లిలో జడ్పీటీసీ ఉమేష్, టీడీపీ మండల కన్వీనర్ కుమారస్వామి, మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ శివకుమార్ బుధవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీడీపీ మేనిఫెస్టో గురించి ఇంటింటికి వెళ్లి తెలియజేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లక్ష్మమ్మ, లింగరాజు, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ లింగన్న, మాజీ ఎంపీటీసీ మల్లేశ్, మండల ప్రధాన కార్యదర్శి జయన్న, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే బీజేపీ రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ బుధవారం మండలంలోని రామాపురంలో కూటమి అభ్యర్థుల తరఫున ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. మేనిఫెస్టోపై వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చ ప్రధాన కార్యదర్శి విక్టోరియారాణి, కిసాన్‌మోర్చ ప్రధాన కార్యదర్శి, దొడ్డ రంగేగౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు హనుమంతరాజు, కిసాన్ మోర్చ మండల అధ్యక్షులు నారాయణప్ప, రవీంద్ర, పిన్నప్ప, తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: మండలంలోని రత్నగిరిలో బుధవారం టీడీపీ మండల నాయకులు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామస్థులను మాజీ ఎంపీపీ నాగలింగాచారి ఇంట్లో సమావేశపర్చి టీడీపీ మేనిఫెస్టో గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిష్టప్ప, బీజేపీ సీనియర్ నాయకులు ముద్దరాజు, మంజునాథ తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ: టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ మద్దనకుంటప్ప పేర్కొన్నారు. టీడీపీ నాయకులు బుధవారం మండలంలోని శంకరగల్లురాళ్లపల్లి పంచాయతీ గ్రామాల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుర్గేష్, శివకుమార్, కొంకల్లు కృష్ణమూర్తి, లక్ష్మీనారాయణ, నజీర్‌అహ్మద్, బాదపల్లప్ప, లక్ష్మీనరసప్ప, జగదీశ్, మాజీ ఎంపీటీసీ హనుమంతరాయప్ప, ఈరన్న, తదితరులు పాల్గొన్నారు.

నడిరోడ్డులో గుంతలు

ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు


గుంతలమయమైన హిందూపురం రహదారి

మడకశిర రూరల్, మే 1: మడకశిర పట్టణం నుంచి హిందూపురం, పెనుకొండకు వేళ్లే ప్రధాన రహదారులు గుంతలమయం అయ్యాయి. దీంతో ప్రజలు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందలు పడుతున్నారు. రోడ్డులో పడిన గుంతలను కూడా పూడ్చలేని స్థితిలో వైసీపీ పాలన ఉందని ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. గత ఏడాది నుంచి గుంతలమైన రోడ్డులో ప్రజలు అవస్థలు పడుతున్నా మరమ్మతులకు ప్రభుత్వం చొరవ చూపలేదని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

మహిళా అష్టావధాని ప్రభావతి మృతి

గుంతకల్లు, మే 1: పట్టణానికి చెందిన అష్టావధాని ఎం కృష్ణ ప్రభావతి (72) అనారోగ్యంతో మృతిచెందారు. ప్రభావతి స్థానిక రైల్వే ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలిగా, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందారు. ఉపాధ్యాయురాలిగా ఉన్న సమయంలో తెలుగులో అష్టావధానాలు చేసేవారు. శ్రీభారతీ సాహితీ సమితికి అధ్యక్షురాలిగా పనిచేసి సాహిత్యసేవ చేశారు. అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందారు. సాయంత్రం ఆమె మృతదేహాన్ని గుంతకల్లులోని విజయనగర్ కాలనీలోని ఆమె స్వగృహానికి తీసుకువచ్చారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గుత్తి, మే 1: పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో లారీ కింద పడి మతిస్థిమితం లేని కురువ శివన్న (26)అనే వ్యక్తి మృతిచెందినట్లు బుధవారం పోలీసులు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన కురువ శివన్న మతిస్థిమితం లేక రైల్లో దిగి వచ్చి ప్రమాదవశాత్తు లారీ కింద పడి మృతి చెందాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

డీ.హీరేహాళ్, మే 1: కర్ణాటక ప్రాంతం నుంచి ఆంధ్రాకు తరలిస్తున్న భారీ మొత్తంలో మద్యాన్ని బుధవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపిన మేరకు కాదలూరు చెక్‌పోస్టు వద్ద సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా కర్ణాటక ఉద్రాల్ గ్రామం నుంచి వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేయగా ఎనిమిది కేసుల్లో 768 కర్ణాటక టెట్రాప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించామనాన్నారు. మద్యం గొడిశలపల్లికి చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకొని వాహనాన్ని స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. నిందితులపై నమోదు చేసినట్లు తెలిపారు.

గాండ్లపెంట: మండలంలోని వేపరాల పంచాయతీ సీఎం తండాలో మద్యం విక్రయిస్తున్న లోకేష్ నాయక్ నుంచి బుధవారం 20 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కృష్ణవేణి తెలిపారు. అందిన సమాచారం మేరకు సీఎం తండాలోని లోకేష్‌నాయక్ ఇంటిలో దాడులు చేశామన్నారు. 20 మద్యం బాటిళ్ల లభించగా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పాపం.. పండుటాకులు

- పింఛన్ కోసం పడిగాపులు
- విసిగి వేసారి వెనుదిరిగిన వైనం


పురంలో సచివాలయం వద్ద వేచివున్న పింఛన్‌దారులు

హిందూపురం అర్బన్/మడకశిర, మే 1: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పింఛన్ పంపిణీ విషయంలో ప్రభుత్వం అవలంభిస్తున్న తీరుతో తీవ్ర ఇబ్బందులు పెడుతున్నట్లు వృద్ధులు, దివ్యాంగులు తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మే 1 నుంచి బ్యాంకు ఖాతాకు ఆధార్ లింక్ అయిన వారికి సొమ్ము ఖాతాలోకి జమచేసే విధంగా... మిగతావారికి, దివ్యాంగులు, దీర్ఘకాలిక జబ్బులతో మంచానికే పరిమితమైన వారు, నడవలేని వారికి ఇంటి వద్దేకే పెన్షన్ డబ్బులు అందేవిధంగా... ప్రభుత్వం నిర్ణయించింది. పింఛన్ పంపిణీ గురించి సరైన సమాచారం లేకపోవడంతో వారు చేత కాకున్నా ఎన్నో అవస్థలు పడి సచివాలయాలు, బ్యాంకుల వద్దకు చేరుకున్నారు. మేడే కావున బ్యాంకులు, సచివాలయాలు తెరవరనే విషయం వారికి చెప్పేవారు కూడా లేరు. దీంతో చాలాసేపు వేచిఉన్నారు. చివరకు విషయ తెలుసుకుని వారు తిట్టుకుంటూ నిరాశతో వెనుదిరిగారు. ఈ విషయం ముందుగా పింఛన్ దారులకు తెలియజేసి ఉన్నింటే బాగుండేదని, ఎండలో ఇంత దూరం రావడం ఇబ్బందిగా ఉందని హిందూపురంలోని 8, 9, 10వ వార్డు సచివాలయం వద్దకు వచ్చిన వారు వాపోయారు. నాకు బ్యాంకు ఖాతాలేదు. సచివాలయంలోనే ఇస్తారని వచ్చానని భక్తర్ అనే పింఛన్‌దారుడు తెలిపారు. పింఛన్ కోసం ఉదయాన్నే 6గంటలకు కాలనీలోని రచ్చబండ వద్దకు వచ్చామని మడకశిరనగర పంచాయతీ పరిధిలో ఒకటవ వార్డు శివాపురం ప్రాంతంలోని తెలిపారు. రోజు గడుస్తున్న పింఛన్ డబ్బు అందలేదు. వైద్యం, మాత్రలకు, తినడానికి ఆ డబ్బుల పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాం, వెంటనే పింఛన్ డబ్బులు అందించాలని ఒకటో వార్డు పింఛన్‌దారులు చంద్రప్ప, బీమప్ప, లక్ష్మమ్మ, అంజనప్ప, కావేశమ్మ తదితరులు కోరారు. ఇదిలా ఉండగా కొందరు పింఛన్‌దారులు మంగళవారం సంబంధిత సచివాలయాల వద్దకు వచ్చారు. సిబ్బందికి ఇచ్చిన జాబితాలో తమ పేర్లు లేవని తెలుసుకుని ఆందోళనకు గురయ్యారు.


మడకశిరలో రచ్చబండ వద్ద వేచి ఉన్న పింఛన్‌దారులు

ఏప్రిల్ నెలలో పింఛన్ తీసుకున్నా



ఏప్రిల్ నెలలో పింఛన్ రూ.3000 తీసుకున్నా. మంగళవారం సచివాలయం వద్దకు వెళ్లి విచారించా. జాబితాలో నాపేరు లేదని సిబ్బంది అంటున్నారు. పింఛన్ రాకపోతే నా పరిస్థితి ఏమిటి?. నెలవారీ మందులకు, తిండికి ఎవరిస్తారు? నా అవసరాలు తీరేదెలా? మందులు వాడకపోతే చాలా ఇబ్బంది కలుగుతుంది. దయచేసి పింఛన్ అందించేలా చూడాలి.

\- గంగయ్య, డీఆర్ కాలనీ, హిందూపురం